సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | గురువారం 04 జూన్ 2026
సంపుటి: 17 | సంచిక: 157
పేజీలు: 08 | వెల: రూ.2:00
Published from Hyderabad, Vijayawada.

## ఆదాయానికి మించి ఆస్తులు

- మాజీ అడిషనల్ ఎస్పీ భుజంగరావు అరెస్ట్
- ఫోన్ ట్యాపింగ్‌లో మరో పరిణామం
- అడిషనల్ ఎస్పీ ఇంట్లో ఎసిబి సోదాలు
- తీగల, లంకల దీపక్‌రెడ్డిలో సిట్ నోటీసులు



హైదరాబాద్,జూన్3(సాక్ష్యం): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ అదనపు ఎస్పీ భుజంగరావును ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ సోదాల్లో ఆయనకు సూర్యాపేటలో 27 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. ఐదు ఇంటి స్థలాలు, రెండు ఇళ్లు, హైదరాబాద్‌లో కమర్షియల్ భవనం, కిలో బంగారు

మిగతా 2 లో..



## రష్యా నుంచి ఎస్-400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టం

### భారత్‌కు చేరుకున్నట్లు రక్షణరంగం వెల్లడి

న్యూఢిల్లీ,జూన్3(సాక్ష్యం): రష్యా నుంచి ఎస్-400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టం నాల్గవ స్క్వాడ్రన్ భారత్‌కు చేరుకుంది. దీంతో భారత గగనతల రక్షణ మరింత బలోపేతం కానుంది.

మిగతా 2 లో..



## మద్యం ఆదాయంపై ప్రత్యేక దృష్టి

### అందుబాటులోకి కొత్తగా 150, 200 ఎంఎల్ బాటిళ్లు

హైదరాబాద్,జూన్3(సాక్ష్యం): తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం విక్రయాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న

మిగతా 2 లో..



## రసవత్తరంగా బెంగాల్ రాజకీయాలు

### రితబ్రత బెనర్జీకి అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా
### స్పీకర్ రతీంద్ర బోస్ ఆదేశాలు జారీ

కోల్‌కతా,జూన్ 3(సాక్ష్యం): పశ్చిమబెంగాల్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. టీఎంసీ రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీకి అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హోదా ఇస్తూ స్పీకర్ రతీంద్ర బోస్ ఆదేశాలు జారీ చేశారు.

మిగతా 2 లో..

# అగ్నికి ఆహుతి

## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

- 21మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు
- 20 మందికిపైగా తీవ్రంగా గాయాలు
- ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి



న్యూఢిల్లీ,జూన్3(సాక్ష్యం): దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు.

మిగతా 5 లో..



## మార్పులకు అనుగుణంగా

# నైపుణ్యాభివృద్ధి

- పాఠ్యాంశాలను ఆధునీకరణలో సహకారం అందించాలి
- ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్‌తో బలమైన అనుబంధం
- స్కిల్స్ పెంచే శిక్షణలో సమగ్ర మార్పులు అవసరం
- నగరంలో జర్మన్ భాషా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి
- ప్రపంచ స్థాయి పెట్టుబడులే లక్ష్యంగా భారత్ ఫ్యూచర్ సిటీ
- ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం
- మారియో వోయిట్ ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్ రెడ్డి
- యువతలో నైపుణ్యాలను తీర్చిదిద్దాలన్న సీఎం రేవంత్
- తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం
- టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

హైదరాబాద్,జూన్3(సాక్ష్యం): తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి

మిగతా 2 లో..

## ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్

- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనండి
- దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో సీఎం రేవంత్ భేటీ



హైదరాబాద్,జూన్3(సాక్ష్యం): భారత్‌లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై

మిగతా 2 లో..

# డీకే శివకుమార్ పట్టాభిషేకం

కర్నాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం

ఉపముఖ్యమంత్రిగా పరమేశ్వర్ ప్రమాణం

మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం

సిద్దరామయ్య, ఖర్గే తనయులకు కేబినేట్‌లో చోటు

హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి



బెంగళూరు,జూన్ 3(సాక్ష్యం): కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లోట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేత బట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకు ముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు. జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా

మిగతా 5 లో..

## తెలంగా ఇన్ సర్వీస్ టీచర్లకు శుభవార్త

### వారి కోసం ప్రత్యేక టెట్ నిర్వహణ

హైదరాబాద్,జూన్3(సాక్ష్యం): తెలంగాణలో సర్వీస్‌లో ఉన్న టీచర్లకు గుడ్‌న్యూస్! ఇకపై ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏటా రెండు సాధారణ టెట్‌లకు

మిగతా 2 లో..



## తెలంగాణపై ఉల్టాపల్టా

# మాటలెందుకు?

## తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

- రాష్ట్ర ఏర్పాటుతో 11 రోజులు అనసం తినలేదన్నావ్
- మా ఇంటికి వస్తే సోదరుడిగా ఆదరిస్తా..బిర్యానీ పెడతా
- మా సచివాలయంలో వేలు పెడతానంటే ఊరుకుంటామా
- ప్రెస్‌క్లబ్‌లో పవన్ కళ్యాణ్‌కు కేటీఆర్ ఘాటు హెచ్చరిక
- వచ్చే ఏడాది ఖచ్చితంగా రాష్ట్రంలో పాదయాత్ర చేస్తా
- కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేను
- తెలంగాణ రాష్ట్రంలో అప్పలపై చర్చకు సిద్ధమే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

హైదరాబాద్,జూన్3(సాక్ష్యం): తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటీఆర్

మిగతా 5 లో..



## తెలంగాణలో భూముల

# విలువల్లో సవరణ


జూన్ 5నుంచి అమల్లోకి రానున్న ఆదేశాలు

## మార్కెట్ రేట్ల మేరకు సవరణలు: పొంగులేటి



హైదరాబాద్,జూన్3(సాక్ష్యం): తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ప్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్

మిగతా 5 లో..



## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ

నెహ్రూ రికార్డుకు మోడీ బ్రేక్

న్యూఢిల్లీ,జూన్3(సాక్ష్యం): నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. ఈ నెల 10న ఇండియాకు అత్యధిక కాలం పని చేసిన ప్రధానిగా నిలవబోతున్నారు. అది కూడా ఎన్నికల్లో గెలిచి, అత్యధిక రోజులు ప్రధానిగా కొనసాగిన జవహర్ లాల్ నెహ్రూను దాటేయబోతున్నారు.

మిగతా 2 లో..

## విద్యుత్ డిస్కమ్‌ను మూడు ముక్కలు

### ఆదాయ డిస్కమ్‌లను ప్రవేట్‌కు అప్పగించే కుట్ర
### బిఆర్ఎస్ సమావేశంలో మాజీమంత్రి వేముల ఆరోపణలు



నిజామాబాద్,జూన్3(సాక్ష్యం): విద్యుత్ డిస్కమ్‌ను మూడు ముక్కలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తున్న కొత్త విధానం వెనుక వేల కోట్ల కుంభకోణం దాగి ఉందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఫ్యాక్టరీలు, కమర్షియల్, గృహ అవసరాల సంబంధించి ఆదాయం వచ్చే డిస్కమ్‌లను

మిగతా 5 లో..

# సంపాదకీయం

## మమత కోటకు బీటలు!

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి.లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ధి చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమత మవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరఫున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరఫున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది.తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగుడుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుం టున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు ఢిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధికారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరువేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు. మమతను ప్రజలే ఛీత్కరించుకునే స్థాయికి వచ్చింది.

## మార్పులకు అనుగుణంగా
# నైపుణ్యాభివృద్ధి

మొదటిపేజీ తరువాయి..

డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని.. ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు




అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన.. తురింగియా సీఎం మారియో వోయిట్.. తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ –2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత–జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

## ఆదాయానికి మించి ఆస్తులు

మొదటిపేజీ తరువాయి..

నగలు, బ్యాంకు ఖాతాలో రూ.3.83 లక్షలున్నట్లు తేలింది. సోదాల్లో రూ.5.92 కోట్ల విలువైన సొత్తును గుర్తించారు. 29 మద్యం సీసాలు కూడా



లభించడంతో ఏసీబీ అధికారులు ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డికి సిట్. నోటీసుల ఇచ్చింది. ఈ కేసుకి సంబంధించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది సిట్. ఈమేరకు దీపక్ రెడ్డికి ఫోన్ కాల్ చేశారు సిట్ అధికారులు. విచారణకు ఎప్పుడొస్తారో చెప్పాలంటూ ఫోన్ కాల్ అడిగారు అధికారులు. ప్రశిక్షణ తరగతులు జరుగుతున్న క్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు అడిగి చెబుతానని బదులిచ్చారు దీపక్ రెడ్డి రెండు మూడు రోజుల్లో దీపక్ రెడ్డి సిట్ ముందు హాజరు కానున్నట్లు తెలుస్తోంది. బండి సంజయ్ పాదయాత్ర, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కిషన్ రెడ్డి దగ్గర పని చేశారు దీపక్ రెడ్డి. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గా పోటీ చేశారు లంకల దీపక్ రెడ్డి. జూన్ 4 ఉదయం 11 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విచారణకు హాజరుకావాలంటూ తీగల కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది సిట్. 2014–18 మధ్య మహేశ్వరం ఎమ్మెల్యేగా ఉన్నారు తీగల కృష్ణారెడ్డి.

## ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి..

ఇరు పక్షాలు చర్చించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని సీఎం తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు.




హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను సీఎం ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంపై మషాటిలే స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో తమ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం జర్మనీలోని తురింగియా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో తురింగియా ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.



## తెలంగా ఇన్ సర్వీస్ టీచర్లకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి..

అదనంగా మరో రెండు ప్రత్యేక టెట్‌లు నిర్వహించను న్నట్లు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక టెట్‌ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. గతేడాది సాధారణ టెట్ లో భాగంగానే ఇన్‌సర్వీస్ టీచర్లకూ ఈ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఏడాదికి రెండుసార్లు ప్రత్యేక టెట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంపై టీఎస్ యూటీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ప్రత్యేక టెట్ నిర్వహించాలని తమతో పాటు పలు సంఘాలు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మాత్రం కొన్ని సంఘాల పేర్లు మాత్రమే పేర్కొనడం భావ్యం కాదని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## రష్యా నుంచి ఎస్-400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టం

మొదటిపేజీ తరువాయి..

ఎస్–400 సుదర్శన్ సుదీర్ఘ శ్రేణి ఎయిర్‌డిఫెన్స్ సిస్టం రష్యా నుంచి నౌకలో భారత్‌కు వచ్చినట్టు రక్షణ శాఖ వర్గాలు బుధవారం నాడు తెలిపాయి. త్వరలోనే ఆపరేషన్ ఏరియాలో దీనిని మోహరించనున్నట్టు వెల్లడించాయి. భారత్ 2018లో రూ.35,000 కోట్లతో 5 స్క్వాడ్రన్ల కొనుగోలుకు రష్యాతో ఒప్పందం చేసుకుంది. ఇందులో 3 స్క్వాడ్రన్లను రెండేళ్ల క్రితమే భారత్ అందుకుంది. నాల్గవది తాజాగా భారత్ చేరుకుంది. మరి కొద్ది నెలల్లోనే 5వ స్క్వాడ్రన్ కూడా భారత్‌కు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. పరేషన్ సిందూర్ సమయంలో పాక్ జరిపిన



డ్రోన్, క్షిపణులను ఎస్–400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అత్యంత సమర్థవంతంగా కూల్చివేసింది. ఏకకాలంలో 300 లక్ష్యాలను ట్రాక్ చేసి, 40 నుంచి 400 కిలోమీటర్ల దూరంలోని శత్రు క్షిపణులను, డ్రోన్లు, స్టెల్త్ ÷టైర్ జెట్‌లను ఈ ఎయిర్ డిఫెన్స్ సిస్టం సమర్థవంతంగా తిప్పికొట్టగలదు. కాగా, భారత్ సైతం రష్యా సిస్టమ్ తరహాలోనే శత్రువిమానాలను కుప్పకూల్చే డిఫెన్స్ సిస్టమ్ 'కుషా'ను స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తోంది. దీని అభివృద్ధి, ఉత్పత్తిలో భాగస్వామిగా ఇండియన్ డిఫెన్స్ మేజర్ సోలార్ ఇండస్ట్రీలు భాగస్వామిగా వ్యవహరిస్తున్నాయి. రష్యా నుంచి ప్రస్తుతం అందుకున్న ఎస్–400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్‌ను పశ్చిమబెంగాల్‌లో మోహరించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## రసవత్తరంగా బెంగాల్ రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి..

అసెంబ్లీలో ప్రతిపక్షానికి కేటాయించిన ఛాంబర్ తాళాలను కూడా సిబ్బంది రితబ్రతకు ఇచ్చేశారు.
అసెంబ్లీలో పార్టీ నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ను తృణమూల్ చీఫ్ మమతా బెనర్జీ ఎంపిక చేయడంతో పార్టీలో కలకలం రేగిన విషయం తెలిసిందే. ఆయన నాయకత్వాన్ని అంగీకరించబోమంటూ మొత్తం 80 ఎమ్మెల్యేల్లో 59 మంది తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. ఆ తరువాత రితబ్రత సారథ్యంలో రెబల్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిశారు. తామే టీఎంసీ అని, రితబ్రతకే ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని లేఖను సమర్పించారు. ఈ నేపథ్యంలో స్పీకర్ తాజాగా రితబ్రతను ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే, తమ నాయకురాలు మమతా బెనర్జీనేనని రితబ్రత ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తనకు పార్టీని చీల్చే ఉద్దేశం ఎంతమాత్రం లేదని అన్నారు. శోభన్‌దేబ్‌ను ప్రతిపక్ష నేతగా గుర్తించాలంటూ గత వారం టీఎంసీ అధినేత్రి మేనల్లుడు, ఎంపీ అభిషేక్ బెనర్జీ స్పీకర్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. కానీ, స్పీకర్ ఈ లేఖను తిరస్కరించారు. ఈ లేఖలోని తమ సంతకాలను ఫోర్జరీ చేశారని ఎమ్మెల్యేలు రితబ్రత, సాందీపన్ ఆరోపించడంతో స్పీకర్ శోభన్‌దేబ్‌కు ప్రతిపక్ష నేత హోదా దక్కలేదు.



## మద్యం ఆదాయంపై ప్రత్యేక దృష్టి

మొదటిపేజీ తరువాయి..

మద్యం సీసాల పరిమాణాలకు అదనంగా కొత్త సైజులను ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ పాత నిబంధనలను సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్లో 90ఎంఎల్, 180ఎంఎల్, 375ఎంల్, 750ఎంఎల్ పరిమాణాల్లో మద్యం బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటితో పాటు కొత్తగా 150, 200 ఎంఎల్ పరిమాణాల్లో మద్యం సీసాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అయితే, కొత్త సీసాల పరిమాణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మద్యం మార్కెట్లో కొత్త మార్పులకు దారితీయనుంది.



## ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

### పేదలకు ఎంతో మేలు చేస్తున్నందన్న గుత్తా

నల్లగొండ,జూన్3(సాక్ష్యం): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో ఎం.వి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నారై మునుకుంట్ల తిరుమల్ రెడ్డి, కొండ భీమనపల్లి మాజీ సర్పంచ్ విద్యావతి వెంకటరెడ్డి ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తో కలిసి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ.. కొండభీమనపల్లిలోని సరస్వతమ్మ ఫంక్షన్ హాల్ లో ఎం.వి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ వారి సహకారంతో పది రోజులపాటు నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరంలో మొబైల్ సర్జికల్ వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా కంటి అద్దాలు అందజేయడం, కంటి పరీక్షల కోసం వచ్చిన వారికి పది రోజుల పాటు భోజన వసతి కూడా కల్పించడం అభినందనీయమన్నారు. ఎన్నారైలు తమ స్వగ్రామాలలో ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ఇంత పెద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ సేవ చేయడం సంతోషకరమైన విషయం అన్నారు. అనంతరం కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలను చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే బాలునాయక్ చేతుల మీదుగా అందజేశారు. వైద్య శిబిరాన్ని డైరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి సందర్శించారు.

## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ

మొదటిపేజీ తరువాయి..



దేశ తొలి ప్రధాని నెహ్రూ మే 13, 1952న పదవీ బాధ్యతలు చేపట్టారు. మే 27, 1964న ఆయన మరణించేవరకు ప్రధానిగానే ఉన్నారు. అలా మొత్తం 4,398 రోజులు ప్రధానిగా కొనసాగారు. ఇంతకాలం పదిలంగా ఉన్న ఈ రికార్డును మోదీ జూన్ 10న చెరిపేయబోతున్నారు. ఈ నెల 10తో మోదీ ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుంటారు. మోదీ మొదటిసారిగా మే 26, 2014న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆయన ప్రధానిగా కొనసాగుతున్నారు. మోదీ ఇంతకుముందు కూడా ప్రధానిగా మరో రికార్డును బద్దలుకొట్టారు. వరుసగా, అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ రికార్డును జూలై 5, 2025న దాటేశారు. ఇందిరాగాంధీ జనవరి 24, 1966న ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టి, వరుసగా 4,077 రోజులపాటు కొనసాగారు. ఆమె మార్చి 24, 1977లో వరకు ప్రధానిగా కొనసాగారు. అలా, ఇందిరా గాంధీ కంటే ఎక్కువ రోజులు వరుసగా ప్రధానిగా మోదీ కొనసాగుతున్నారు. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోదీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951?52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది.

# ఆరోగ్యం ఉంటేనే సంపద..

**సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులు**

**యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదు**

**21న కృష్ణా తీరంలో యోగా ప్రదర్శనలు**

**సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**

గుంటూరు,జూన్ 3: ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని తక్కెళ్లపాడులో సీఎం చంద్రబాబు పర్యటించారు. లలిత ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించారు. వేల కోట్లు, పదవులు ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభంలేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి.. ల్యాండ్‌మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ హాస్పిటల్లోని స్కానర్ సౌత్ ఇండియాలోనే లేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైందని సీఎం చంద్రబాబు తెలిపారు. 32 విభాగాలకు వైద్యసేవలు అందించే ఏకైక కేంద్రం ఇదని వివరించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే.. ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచి అలవాట్లతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చుని చెప్పారు. యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదని పేర్కొన్నారు. మనిషికి ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వారే నిజమైన ధనవంతులని చెప్పుకొచ్చారు. ఆరోగ్యవంతులైన పౌరులు ఆరోగ్యకరమైన దేశాన్ని తయారు చేస్తారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. సబ్జెక్టు అర్థం చేసుకుని వైద్య ఆరోగ్య శాఖను చక్కగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టు తెస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య పరిజ్ఞానం తెచ్చి ప్రజలకు ఇస్తామని అన్నారు. వ్యాధులు రాకుండా ఏం చేయాలో, వ్యాధి నిర్ధారణ నివారణకు సంబంధించి అత్యుత్తమ విధానాలు అమలు చేస్తామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తెచ్చి రెండున్నర లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తామని.. కానీ అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. తినే తిండి, మంచి అలవాట్లు, మన పరిసరాలు, మనం ఆలోచించే విధానం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని వివరించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడేలా ఉండాలని అన్నారు. గతంలో పంటలను రసాయన ఎరువులు, పురుగు మందులు వేయకుండా పండించామని ప్రస్తావించారు. జగన్ హయాంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయని అన్నారు. వైసీపీ హయాంలో దుర్మార్గమైన నిర్ణయంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. క్వాంటం, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్ రీసెర్చ్ వంటి విభిన్న సాంకేతిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇంట్లోనే ఉంటూ ఫోన్లు వాడితే ఎలా...? కుటుంబ సభ్యులు నేరుగా మాట్లాడుకోవాలని సూచించారు. పది నిమిషాలు వ్యాయామం చేయటానికి ఓపిక లేకపోతే ఎలా..? అందుకే అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీన మరోసారి యోగా ద్వారా రికార్డులు సృష్టిద్దామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కృష్ణా నది బైపాస్ రహదారిపై యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సంప్రదాయ వైద్య విధానాలు ప్రమోట్ చేస్తున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి గిన్నిస్ రికార్డులు వచ్చాయని ప్రస్తావించారు. మెడిటేషన్ యోగా కేంద్రాలు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతన్నలు ప్రకృతి వ్యవసాయం చేయాలని సీఎం ఆకాంక్షించారు. ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని సీఎం చంద్రబాబు వివరించారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తామని అన్నారు. 'ఆస్పత్రులు ఆలయాలని.. వైద్యులు దేవుళ్లు. వైద్యో నారాయణో హరి అనేది మన సంస్కృతిలో ఉంది. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలని తన కోరిక. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సమాజమే మా లక్ష్యం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.




# రష్యా పర్యటనలో పెట్టుబడుల వేట

**పలు సంస్థల ప్రతినిధులతో లోకేశ్ భేటీ**

**కెమికల్ సంస్థ రస్‌కెమ్ గ్రూపు సిఇవోతో చర్చలు**

**రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ ప్రతినిధులతో సమాలోచనలు**

మాస్కో,జూన్3: రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ–కాకినాడ పీసీపీఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయండని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్త్‌ల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పీవీల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ప్లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.అలాగే రష్యా ప్రభుత్వ నియంత్రిత ప్రముఖ రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో నారా లోకేశ్ మాస్కోలో భేటీ అయ్యారు. వెస్ట్రన్ ప్లాట్‌ఫామ్‌లకు సురక్షితమైన లోకలైజ్డ్ జనరేటివ్ ఏఐ ప్రత్యామ్నాయ వ్యవస్థను అందించిన తరహాలోనే భారతదేశంలో బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు స్బేర్ బ్యాంక్ గిగాచాట్ ఎల్ఎల్ఎంను విస్తరించాలని నారా లోకేశ్ కోరారు. జాతీయ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ నెట్‌వర్క్ భద్రతను పటిష్ఠం చేస్తూ, స్బేర్‌బ్యాంక్ అడ్వాన్స్‌డ్ వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారతదేశ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లో ఇంటిగ్రేట్ చేసేలా సాంకేతిక సహకారం అందించాలన్నారు. భారత్‌లో పెద్దఎత్తున మున్సిపల్ కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్, డిజిటల్ సేఫ్టీ సిస్టమ్‌లను విస్తరించాలన్నారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజినీర్లకు వేగంగా శిక్షణ ఇవ్వడానికి, స్బేర్ బ్యాంక్ గేమిఫైడ్, పీర్-టు-పీర్ 'స్కూల్ 21' కోడింగ్ అకాడమీలను భారతదేశంలోని ప్రధాన విద్యా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని కోరారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం దూరప్రాంతాలకు రూపాయి-రూబుల్ వాణిజ్య అనుమతులు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. తమ బ్యాంక్ భారత్‌లోని న్యూఢిల్లీ కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక కమర్షియల్ ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు, భారత్-రష్యా క్లయింట్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ చెప్పారు. మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.




# బడి బాట బంగారు బాట

**బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి**

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలి**

**రాయపర్తి తహసిల్దార్ శ్రీనివాస్**

**పాఠశాలలపై నమ్మకం కలిగించాలి: ఎంపీడీఓ కూచన ప్రకాశ్**

**పథకాలపై అవగాహన కల్పించాలి : శ్రీనివాస్ ఎంఈఓ**

రాయపర్తి, జూన్ 03 (సాక్ష్యం): ప్రభుత్వ పాఠ శాలల్లో బడీడు పిల్లలను బడిలో చేర్పించి, విద్యార్థుల నమోదు శాతాన్ని గణనీయంగా పెంచాలని రాయపర్తి తహసిల్దార్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం రాయపర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో బడిబాట కార్యక్రమం స్వచ్ఛ భారత్ మిషన్ అమలుపై మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సందర్భంగా తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని ప్రతి అధికారి, ఉపాధ్యాయుడు క్షేత్రస్థాయిలో పర్యటించి బడి ఈడు



పిల్లలను గుర్తించి వంద శాతం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేలా కృషి చేయాలని అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కూచన ప్రకాశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న నాణ్యమైన విద్య, వసతుల పట్ల ప్రజల్లో తల్లిదండ్రుల్లో సంపూర్ణ నమ్మకాన్ని కలిగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బడిబాట విజయవంతానికి విలేజ్ లెవెల్ కమిటీలు చురుగ్గా పనిచేయాలన్నారు. అదేవిధంగా, స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఘన వ్యర్థాల నియమావళి 2026 పై మండల వ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఇకపై ఇళ్ల నుండి సేకరించే చెత్తను తడి, పొడి, హానికరం , మరియు పునర్వినియోగానికి పనికొచ్చే చెత్తగా నాలుగు రకాలుగా విభజించేలా ప్రజలను చైతన్యపరచాలని, ఇందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. మండల విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ బడిబాట నోటీస్



పత్రంలో పేర్కొన్న విధంగా ప్రతి పాఠశాల నుండి క్లాస్ వారీగా విద్యార్థుల నమోదు వివరాలను గూగుల్ స్ప్రెడ్‌షీట్ ద్వారా రోజువారీగా నమోదు చేసేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం, ఇతర సంక్షేమ పథకాల గురించి గ్రామాల్లో ప్రజలకు వివరించి, ప్రభుత్వ విద్య వైపు మొగ్గు చూపేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కోరారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల పరామర్శ

కోదాడ జూన్ 03,( సాక్ష్యం) కోదాడ మండలంలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రామాలయం వైస్ చైర్మన్ అన్నెం నర్సింహారెడ్డి తండ్రి అన్నెం వెంకటరెడ్డి మోకాలు ఆపరేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి బుధవారం అన్నెం వెంకటరెడ్డిని పరామర్శించి, వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి తులశమ్మ కన్నారెడ్డి, ఉప సర్పంచ్ బెల్లంకొండ సీతయ్య, రాష్ట్ర కౌలు రైతుల ఉపాధ్యక్షుడు అన్నెం పాపిరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ కొప్పుల సుభాష్ రెడ్డి,రామాలయం చైర్మన్ కొప్పుల సుబ్బారెడ్డి, ఎర్రవరం గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ లతీఫ్,, టి సుజాత రామయ్య, అన్నెం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ వర్ధన్నపేట ఎమ్మెల్యే

**నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు**

**ఈ అవకాశాన్ని నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకొవాలి**



వర్దన్నపేట, జూన్ 3(సాక్ష్యం): వర్దన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వర్దన్నపేట నియోజకవర్గంలో ఎవరికైనా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని నేరుగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు చెప్పేలా డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చేపట్టారు. జూన్ 4న (నేడు) గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 7551166666 నంబరుకు ఫోన్ చేసి, నేరుగా ఎమ్మెల్యేతో మాట్లాడవచ్చు అని ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు వివరించారు. అయితే కాల్ చేసే వారు నిర్దేశించిన తేదీ, సమయంలో మాత్రమే కాల్స్ చేయాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గం ప్రజలు అందరు సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కారం చేసుకోవాలని ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు కోరారు.

## పండు మాస్టర్‌కు ప్రమాదం లేదన్న వైద్యులు

**విశాఖ ఆస్పత్రిలో కాళ్లకు శస్త్ర చికిత్సలు**

**రోడ్డు ప్రమాదంలో కాళ్లకు తీవ్ర గాయాలు**

విశాఖపట్టణం,జూన్3: ప్రఖ్యాత డ్యాన్స్ షో 'ఢీ' ద్వారా తెలుగు ప్రేక్షకులకు ఎంతో చేరువైన ప్రముఖ కొరియోగ్రాఫర్, డ్యాన్సర్ పండు మాస్టర్ విశాఖపట్నంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు తాజాగా హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. వైద్యులు వెల్లడించిన వివరాల ప్రకారం ప్రమాదంలో పండు మాస్టర్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ముఖ్యంగా హిప్ జాయింట్ డిస్‌లొకేట్ కావడంతో పాటు మోకాళ్ల కింద భాగంలోని ఎముకలు, జాయింట్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. అన్ని వైద్య పరీక్షలు పూర్తిచేసిన అనంతరం ఒక సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. హిప్ జాయింట్‌కు సంబంధించిన సమస్యను తొలి ఆపరేషన్ ద్వారా పరిష్కరించామని, మిగిలిన గాయాలకు సంబంధించి మరికొన్ని శస్త్రచికిత్సలు చేయాల్సి ఉందని డాక్టర్లు తెలిపారు. ప్రమాద సమయంలో తలకు కూడా గాయం అయినప్పటికీ ప్రస్తుతం ఎలాంటి ప్రాణాపాయ పరిస్థితి లేదని స్పష్టం చేశారు. పండు మాస్టర్ అభిమానులను ఎక్కువగా ఆందోళనకు గురిచేసిన అంశం ఆయన భవిష్యత్తులో మళ్లీ డ్యాన్స్ చేయగలరా అనే ప్రశ్న. దీనిపై వైద్యులు సానుకూల సమాచారం ఇచ్చారు. అవసరమైన శస్త్రచికిత్సలు పూర్తయిన తర్వాత కనీసం ఆరు నెలల పాటు విశ్రాంతి తీసుకుంటే పూర్తిగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడిన అనంతరం తిరిగి తన డ్యాన్స్ కెరీర్‌ను కొనసాగించవచ్చని, ప్రస్తుతం అందుకు ఎలాంటి ప్రమాద సూచనలు కనిపించడం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ సమాచారం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. మంగళవారం పండు మాస్టర్ తన బృందంతో కలిసి విశాఖ జిల్లా తగరపువలసలో నిర్వహించిన అమ్మవారి ఉత్సవాల్లో ప్రత్యేక డ్యాన్స్ ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి ప్రయాణం చేస్తుండగా ఆనందపురం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణం మధ్యలో టీమ్‌లోని ఒక డ్యాన్సర్ అస్వస్థతకు గురికావడంతో వాహనాన్ని రోడ్డుపక్కన ఆపారు. ఆ సమయంలో పండు మాస్టర్ కారులో నుంచి దిగి వెనుక భాగంలో నిలబడి ఉన్నారు. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కోళ్ల వ్యాన్ అదుపు తప్పి కారును బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో కారు, వ్యాన్ మధ్య పండు మాస్టర్ చిక్కుకుపోయారు. దీంతో ఆయన రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, సహచరుల సహాయంతో వెంటనే ఆస్పత్రికి తరలించినట్టు తెలుస్తుంది.

## రాష్ట్రాలు వేరైనా తెలుగువారంతా ఒక్కటే

**ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడైనా రాజకయిాం చేయొచ్చు**

**పవన్ కళ్యాణ్‌పై విమర్శల నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్య**

అమరావతి,జూన్ 3: రాష్ట్రాలు వేరైనా తెలుగువారంతా ఒక్కటేనని, అనవసర వివాదాలతో ప్రాంతీయ విద్వేషాలు సృష్టించడం సరికాదని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని తెలంగాణలో కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా, ఎక్కడైనా రాజకీయం చేసే హక్కు ఉంటుందని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'గతంలో నేను తమిళనాడు వెళ్లి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ కూడా ఇతర రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ తాము జాతీయ పార్టీ అని ప్రకటించుకుంది కదా.. ఇప్పుడెందుకు అనవసరంగా మాట్లాడుతున్నారు. అమెరికాలో కూడా తెలుగువారు సెనేటర్లు అవుతున్నారు. ప్రజాసేవ చేసినవారినే ప్రజలు ఆదరిస్తారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు తెలంగాణలో మాట్లాడుతున్న మాటలు ఎంతమాత్రం కరెక్ట్ కాదు. రెండు రాష్ట్రాలుగా విడిపోయి 12 ఏళ్లు అవుతోంది. ఇన్నాళ్ల తర్వాత ఇప్పుడెందుకు మళ్లీ ఇవన్నీ సృష్టిస్తున్నారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం ఎవరికీ మంచిది కాదు. తెలంగాణ రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ.. తెలుగువారిగా అంతా కలిసికట్టుగా ఉండాలి. రెండు రాష్ట్రాలనూ ప్రగతి పథంలో నడిపించుకోవడమే అందరి లక్ష్యం కావాలి' అని అన్నారు.

## పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం

### తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక
### ఆరెంజ్ అలర్ట్ జారీచేసిన అధికారులు

హైదరాబాద్,జూన్ 3(సాక్ష్యం): తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉ ఒడటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉ ఒడాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## పంట వ్యర్థాలతో సేంద్రియ ఎరువులు

### రైతులకు శాస్త్రవేత్తల సూచన

కరీంనగర్,జూన్3(సాక్ష్యం): రైతులు పంట అవశేషాలను కాల్చకుండా పొలంలోనే కలిపి సేంద్రియ పదార్థంగా మార్చుకోవాలని వాటిపై రైతులు మొగ్గు చూపాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ రెడ్డి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిగురుమామిడి మండలంలోని సుందరగిరి రైతు వేదికలో సర్పంచ్ జంగ శిరీష అధ్యక్షతన రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పంట అవశేషాలు దహనం వల్ల నేలలోని ఉపయోగకర సూక్ష్మజీవులు నశించి నేల సారం తగ్గిపోవడంతోపాటు వాతావరణ కాలుష్యం పెరుగుతుందని అన్నారు. నేల పరీక్షల ఆధారంగా మాత్రమే పంటలను రైతులు వినియోగించాలన్నారు. యూరియా అధికంగా వాడటం వల్ల ఖర్చులు పెరగడంతోపాటు భూసారం దెబ్బతింటుందని అన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు వేయాలని, సన్న రకాల వరి వంగడాల సాగుపై దృష్టి సారించాలన్నారు. జీవామృతం, ఘనజీవామృతం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అనుసరించాలని సూచించారు. పంటల సాగులో ఏఈఓల సలహా, సూచనలను రైతులు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, పశువైద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రణయ్, రాకేష్, అఖిల, సౌమ్య, అంజలి రైతులు పాల్గొన్నారు.

## మహిళా ఉపాధి కూలీలకు అవగాహన

### షీ టీమ్ ఆధ్వర్యంలో వివిధ మోసాలపై వివరణ

పెద్దపల్లి,జూన్3(సాక్ష్యం): పెద్దపల్లి జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు మహిళల భద్రత, చైల్డ్ సేఫ్టీ, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్ మెంబర్ స్నేహలత మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరం గస్తీ నిర్వహిస్తారన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అత్యాశకు పోయి ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని అన్నారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఆసియా బేగం, ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మి, షీ టీమ్ సభ్యులు, సురేష్, మౌనిక, పాల్గొన్నారు.

## హరీష్‌తో జాగ్రత్త కేటీఆర్..

### బిఆర్ఎస్ పార్టీలో నాయకత్వ సమస్య ఉంది
### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,జూన్ 3(సాక్ష్యం): మాజీ మంత్రి హరీశ్‌రావుతో రాజకీయంగా ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ హెచ్చరించారు. సీఎల్పీ మీడియా హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు రాజకీయ అంశాలపై స్పందించారు. హరీశ్‌రావుతో కేటీఆర్ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని, బీఆర్ఎస్‌లో నాయకత్వ సంక్షోభం నెలకొందని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా అద్దంకి దయాకర్ విమర్శలు చేశారు. పదవుల కోసం త్యాగాలు చేశానని చెప్పే కేసీఆర్, ప్రతిపక్ష నాయకుడి హోదాకు రాజీనామా చేయాలన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై వస్తున్న విమర్శలను ఖండించిన ఆయన, భవిష్యత్తు లేని నాయకులకే ఫ్యూచర్ సిటీపై భయం పట్టుకుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టాప్-100 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి తీసుకొచ్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అలాగే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంపై కేటీఆర్‌కు పూర్తి అవగాహన లేదని, అవసరమైతే దానిపై ప్రత్యేకంగా క్లాస్ చెబుతామని ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకత్వంపై సొంత పార్టీ నేతలకే నమ్మకం లేదన్న అద్దంకి దయాకర్, ప్రజలు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. రెచ్చగొట్టే రాజకీయాలు చేసి లబ్ధి పొందాలని ప్రయత్నించవద్దని ప్రతిపక్షాలకు అద్దంకి దయాకర్ సూచించారు.

# అగ్నికి ఆహుతి

మొదటిపేజీ తరువాయి..




20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉ ఒటామని హామీ ఇచ్చారు.

# డీకే శివకుమార్ పట్టాభిషేకం



మొదటిపేజీ తరువాయి..

ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య



కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### తెలంగాణపై ఉల్టాపల్టా
# మాటలెందుకు?



మొదటిపేజీ తరువాయి..

స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు. 'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక పాంత్రీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని కేటీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు. 1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణిచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని.. తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే.. తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి.. ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు. కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదమని ప్రజలకు అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు.

వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చూస్తున్నానని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని కేటీఆర్ తెలిపారు. 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉ ఒటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్‌లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కడుపులో కత్తులు పెట్టుకుని.. పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా.. దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ ఈ మేరకు స్పందించారు. నాకు అహంకారమని అంతా ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని కొన్ని మ్యాన్యుఫ్యాక్చరింగ్ డిఫెక్ట్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని.. కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని నాకు మాట్లాడటం రాదని చెప్పారు. తెలంగాణ వాడిని కదా.. కడపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.2.8 లక్షలు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేడయంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ.29వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని తెలిపారు. నెలకు రూ.6వేల కోట్ల అప్పు తీరుస్తాన్నమనేది అబద్ధమని స్పష్టం చేశారు. రూ.2వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని స్పష్టం చేశారు.



### తెలంగాణలో భూముల
# విలువల్లో సవరణ

మొదటిపేజీ తరువాయి..

కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ , అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ప్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ప్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్ఎండిఏ, క్యూర్ ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ప్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఎ÷-లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాంఅని మంత్రి తెలిపారు.

## విద్యుత్ డిస్కమ్‌ను మూడు ముక్కలు

మొదటిపేజీ తరువాయి..

ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి వేల కోట్లు దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పథకం వేసిందని ఆరోపించారు. ఆదాయం లేని, బిల్లులు రాని రైతు వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ, లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లను కలిపి 'రైతు డిస్కాం'గా మారుస్తున్నారని తెలిపారు. నిజామాబాద్ నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, సర్ అవగాహనా, బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ.. గతంలో కమర్షియల్, ఇండస్ట్రియల్ విభాగాల నుండి వచ్చే ఆదాయంలో నుండి ఏటా రూ.10 వేల కోట్లు ఉచిత వ్యవసాయ విద్యుత్ కోసం వాడేవారమని, ఇప్పుడు లాభాలు వచ్చేవి ప్రైవేటుకు ఇచ్చి, కరెంట్ డిపార్ట్‌మెంట్‌పై ఉన్న రూ.35,000 కోట్ల బాకీని రైతు డిస్కాంపై నెడుతున్నారని మండిపడ్డారు. దీనివల్ల భవిష్యత్తులో రైతులకు ఉచిత కరెంట్ అందకుండా చేసి, వ్యవసాయ రంగాన్ని నిలువునా ముంచేసేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని, ఈ వేల కోట్ల కుంభకోణాన్ని ప్రజలందరికీ వివరించి కాంగ్రెస్ గుట్టు రట్టు చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నిజామాబాద్ నగరంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధిని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాశనం చేస్తున్నాయని, ప్రజల కోసం ఉద్దేశించిన ప్రభుత్వ ఆస్తులను కాంగ్రెస్ పార్టీ తన సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. గతంలో బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్న సమయంలో నిజామాబాద్ జిల్లా ప్రజల అవసరాల కోసం మెయిన్ రోడ్డుపై, రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఇరిగేషన్ ఎస్ఈ ఆఫీస్ స్థలాన్ని కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం ఎంపిక చేసి ఆనాడు ఆర్టీసీ బోర్డు మీటింగ్‌లో రూ. 20 కోట్ల నిధులతో అత్యాధునిక బస్టాండ్ నిర్మించాలని ప్రతిపాదనలు కూడా ఆమోదించారు. కానీ నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, కోట్ల రూపాయల విలువైన ఆ బస్టాండ్ స్థలాన్ని ప్రజల అవసరాలకు కాకుండా, వారి సొంత కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ కోసం, కమర్షియల్ కాంప్లెక్స్ (షాపింగ్ మాల్స్) నిర్మించి కిరాయిల ద్వారా డబ్బులు సంపాదించుకోవడానికి కేటాయించు కోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడే పవన్ కళ్యాణ్ ఇక్కడ సభల పెడుతా అనడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ వస్తే బాధపడి 11 రోజులు అన్నం తినని పవన్ కళ్యాణ్ ఇవాళ మన గడ్డపైకొచ్చి పునర్నిర్మాణం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ వీజీ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్ రెడ్డి, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, నియోజకవర్గ ఇంచార్జ్ రవీందర్ సింగ్, మాజీ మేయర్ నీతు కిరణ్, నూడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సిర్ప రాజు, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్ ఠాకూర్, నవీద్ ఇక్బల్, పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రిన్స్‌టన్ విద్యా సంస్థలకు సుప్రీం మొట్టికాయలు

### అమెరికా యూనివర్సిటీ పేరు వాడటంపై ఆంక్షలు
### తక్షణం సంబంధం లేదంటూ ప్రకటన విడుదలకు ఆదేశం

న్యూఢిల్లీ,జూన్3(సాక్ష్యం):
అమెరికాలో ఉన్న ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ పేరు వాడుతుండటంపై తెలంగాణలోని ప్రిన్స్‌టన్ విద్యాసంస్థలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ యూనివర్సిటీకి తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ బోర్డులు పెట్టాలని తెలంగాణ కాలేజీని ఆదేశించింది. జూన్ 12లోగా ప్రముఖ దినపత్రికల్లో కనీసం పావు పేజీ ప్రకటనలు ఇవ్వాలని కాలేజీ యాజమాన్యాన్ని ఆదేశించింది .అమెరికా యూనివర్సిటీ విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణలో వాగ్దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ 'ప్రిన్స్‌టన్' పేరుతో కాలేజీలను నడుపుతోంది. తమ ట్రేడ్‌మార్క్‌ను వినియోగిస్తున్న వాగ్దేవి సంస్థలపై అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక 'ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ' కేసు పెట్టింది. దీనికి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. కాలేజీ వెబ్‌సైట్లలో అందరికంటే పెద్ద అక్షరాలతో 'డిస్‌క్లెయిమర్ నోటీసు' స్పష్టంగా ప్రదర్శించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కళాశాలకు సంబంధించిన అన్ని రకాల సర్టిఫికెట్లు, ఇతర అన్ని పత్రాలు, ఫారాలపై తప్పనిసరిగా డిస్‌క్లెయిమర్ ముద్రించాలని స్పష్టం చేసింది. నూతన విద్యా సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యేలోపే నిబంధనలను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతర్జాతీయ బ్రాండ్ల పేరుతో విద్యార్థులు అయోమయానికి గురి కాకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## బిఎంఎస్ 29వ ద్వైవార్షిక మహాసభలు విజయవంతం చేయాలి



బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య కార్యనిర్వాహక అధ్యక్షులు అప్పని శ్రీనివాస్, బ్రాంచి ఉపాధ్యకులు వెలబోయన సుజేందర్

(సాక్ష్యం) న్యూస్ జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 3 : బిఎంఎస్ 29వ ద్వైవార్షిక మహాసభలు విజయవంతం చేయాలని భూపాలపల్లి ఏరియా కే.టి.కే. 1 ఇంక్లైన్ బిఎంఎస్ బ్రాంచి ఉపాధ్యకులు వెలబోయన సుజేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ద్వార సమావేశానికి ముఖ్య అతిథులుగా బి ఎం ఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య కార్యనిర్వాహక అధ్యక్షులు అప్పని శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతు.. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ 29వ ద్వైవార్షిక మహాసభలు ఈ నెల 7వ తేదీన భూపాలపల్లిలో జరుగు మహాసభలను విజయవంతం చేయాలి అనీ కార్మికులను కోరారు. సింగరేణి పరిశ్రమ పరిరక్షణ,కార్మిక హక్కుల సంరక్షణ కొరకు అహర్నిశలు కృషి చేయాలని, సింగరేణి కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా అలవెన్సులుపై ఆదాయ పన్ను రియంబర్స్ మెంటు చెల్లించాలని డిమాండ్ చేసినారు. సింగరేణి పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన విద్యుత్తు బొగ్గు బకాయిలు సుమారు రూ.51,149 వేలకోట్లు సింగరేణి సంస్థకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినారు. 12వ వేజ్ బోర్డు కొరకు ప్రత్యేకమైన కృషి బిఎంఎస్ చేస్తుందని జూన్ 30 తేదీ తో కాల పరిమితి ముగుస్తున్న నేపథ్యంలో జూలై 1 వ తేదీ నుండి 12వ వేజ్ బోర్డు ప్రారంభం అవుతున్నందున కోల్ ఇండియా యాజమాన్యం కమిటీ నిర్మాణానికి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం నివారణకు నిర్మూలనకు కార్యాచరణ మహాసభలలో చేస్తామని తెలిపారు, సింగరేణి సంస్థలో నూతన బొగ్గు గనుల ప్రారంభ దిశకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపినారు,

## కేటీకే-5 గనిలో ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి

(సాక్ష్యం) న్యూస్ జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 3: కేటీకే-5 గనిలో ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి. భూపాలపల్లి ఏరియా సింగరేణి లో ప్రమాదాల నివారణ, సురక్షితమైన పని వాతావరణం కల్పించడం ఉద్యోగుల్లో భద్రతా చైతన్యాన్ని మరింత పెంపొందించడమే లక్ష్యంగా కేటీకే-5 భూగర్భ గనిలో ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా





నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... ఉద్యోగులకు భద్రతా నియమాలు, పనిస్థలాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు భద్రతా ప్రమాణాల ప్రాముఖ్యతపై సమగ్ర అవగాహన కల్పించారు. ఉద్యోగుల భద్రత సంస్థకు అత్యంత ప్రాధాన్య అంశమని అన్నారు. గనుల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ భద్రత విషయంలో రాజీ పడకుండా వ్యవహరించాలని తెలిపారు. సంస్థ నిర్దేశించుకున్న "జీరో హార్మ్" లక్ష్య సాధనకు యాజమాన్యం, అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పనికి ముందు భద్రతా పరిస్థితులను పరిశీలించడం, వ్యక్తిగత రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించడం, యంత్రాలు పరికరాలను నిర్దేశిత విధానాలకు అనుగుణంగా ఉపయోగించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. భద్రత అనేది కేవలం నిబంధన మాత్రమే కాకుండా ప్రతి ఉద్యోగి అలవాటుగా మార్చుకోవాల్సిన బాధ్యత అని ఆయన అన్నారు.

## డిపెండెంట్ కార్మికులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్
- జిఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా, వినతి పత్రం అందజేత

(సాక్ష్యం) న్యూస్ జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 3 : సింగరేణిలో మెడికల్ అన్ ఫిట్ పొందిన కార్మికుల పిల్లలకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి జిఎం కార్యాలయం ఎదుట సింగరేణి వ్యాప్తంగా 400 మంది కార్మికులు డీపెండెంట్ ఉద్యోగాలు పొంది ఉన్న వారికి నియామక పత్రాలు అందజేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొరిమి రాజ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా వివిధ అనారోగ్య కారణాలవల్ల మెడికల్ అన్ఫిట్ పొందిన కార్మికుల పిల్లలకు సుమారు 400 మంది డిపెండెంట్ ఉద్యోగం పొంది ఉన్నారని వారికి ప్రభుత్వం,సింగరేణి యాజమాన్యం నియామక పత్రాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందన్నారు. వారిపై ఆధారపడి జీవిస్తున్న



కుటుంబాలు ఇల్లు గడవక దుర్భర జీవితాలు గడుపుతున్నారని అన్నారు. డిపెండెంట్ కార్మికులకు ప్రభుత్వం కేవలం నియామక పత్రాలు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. సింగరేణి వ్యాప్తంగా 400 మంది నియామక పత్రాలకు కోసం ఎదురుచూస్తున్నారని అందులో ఒక్క భూపాలపల్లి ఏరియా నుండి సుమారు 70 మంది డిపెండెంట్ కార్మికులు ఉద్యోగంలో ఆన్ ఫీట్ అయి ఉన్నారని, సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికి నియామక పత్రాలు అందజేయకపోవడం సరైనది కాదన్నారు. వెంటనే ప్రభుత్వం వారికి ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని కోరారు.

## నిత్య కళ్యాణం తంతులో మాంగల్య ధారణ చూపిస్తున్న పూజారి

యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్.
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో బుధవారం వేకువ జామున సుప్రభాతం చేపట్టిన పూజారు లు గర్భాలయంలోని మూలవర్లను మేల్కొల్పి నిత్యారాధనలకు శ్రీకారం చుట్టారు. బిందె తీర్థం బాలభోగం నివేదించారు.





కవచమూర్తులకు సువర్ణ పుష్పాలతో అర్చన జరిపారు. వేదమంత్ర పట నాలతో అష్టోత్తరం, స్వర్ణ పుష్పారాధన పర్వాలు కొన సాగించారు. అష్టభుజ మండపంలో శ్రీ సుదర్శన నరసింహ హోమం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం ఆలయ ఆచారంగా చేపట్టారు. గజవాహనంపై కళ్యాణమూర్తులను సాయంత్రం అలంకార జోడు సేవల ఊరేగింపు తతంగాలను నిర్వహించారు. దర్బార్ సేవొత్సవం చేపట్టారు. రాత్రి స్వయంభులకు ఆరాధన సహస్రనామార్చన జరిపారు.

# చిన్నబోయినపల్లి గ్రామస్థుల సంచలన నిర్ణయం

### శభాష్ అంటున్న అధికారులు

ములుగు 3 జూన్ (సాక్ష్యం)
ప్రభుత్వ విద్య బలోపేతానికి ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామస్థులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని పిల్లలందరినీ స్థానిక యూపీఎస్ పాఠశాలలోనే చేర్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రైవేట్ పాఠశాలల వాహనాలను గ్రామంలోకి అనుమతించకూడదని నిర్ణయించారు. గ్రామసభనిర్ణయాన్ని ఉల్లంఘించి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపితే సంబంధిత కుటుంబాలపై గ్రామసభ తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో, ములుగు జిల్లా ఏటూరునాగారం





మండలం చిన్నబోయినపల్లి గ్రామం రాష్ట్ర విద్యావ్యవస్థకే ఒక గొప్ప దిక్సూచిలా నిలిచింది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ఆ ఊరి ప్రజలు వేసిన అడుగు చారిత్రాత్మకం. "సామాజిక సమానత్వం విద్య ద్వారానే సాధ్యం" అనే సామాజిక స్ఫూర్తితో గ్రామంలో జరిగిన 'మహా అడ్మిషన్ల జాతర నిర్వహించారు గ్రామంలోని ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి చదువుల తల్లి ముంగిట ఒక్కరోజే ఏకంగా 103 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం తెలంగాణ విద్యా చరిత్రలో మునుపెన్నడూ చూడని అరుదైన ఘట్టం గ్రామంలో కన్పించింది ప్రజల ఈ అక్షర సంకల్పానికి అన్ని వర్గాల నుండి సంపూర్ణ మద్దతు లభించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత టీచర్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథులుగా చిన్నబోయినపల్లి గ్రామ సర్పంచ్ నల్లబోయిన నాగార్జున, ఎంఈవో సీడీపీవో ప్రభుత్వ డాక్టర్స్ ప్రభుత్వ




అధికారులు వచ్చి అభినదనలు తెలిపారు . గ్రామాభివృద్ధి పట్ల, విద్యాభివృద్ధి పట్ల తమకున్న నిబద్ధతను చాటుతూ సభలో పాల్గొని గ్రామస్తులను అభినందించారు. హెచ్ఎం కవిత టీచర్ పర్యవేక్షణలో, ఈ అతిథులందరి చేతుల మీదుగా కొత్తగా అడ్మిషన్ తీసుకున్న 103 మంది విద్యార్థులకు 'వెల్కమ్ కిట్స్' అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అయితే ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాయకులు, అధికారులు విద్యార్థులను ఉత్సాహపరిచారు. బడి పిల్లల భద్రత కోసం అత్యంత కీలకమైన ప్రహరీ గోడ నిర్మాణం పాఠశాల సమగ్ర అభివృద్ధి కోసం 'ఆశయం గ్రంథాలయం' పాఠశాల అభివృద్ధికి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు, స్వయంగా ఇదే గ్రామానికి చెందిన కానిస్టేబుల్ దగ్గరుండి అధికారులతో పదేపదే చర్చిస్తూ సమన్వయం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క సహకారం కూడా ఉన్నట్లు అయన తెలిపారు విద్యార్థుల



సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో గతంలో కొంత నిరాశ నెలకొన్నప్పటికీ, చిన్నబోయినపల్లి ప్రజలు 103 అడ్మిషన్లతో ప్రభుత్వ పాఠశాలల పట్ల తమకున్న నమ్మకాన్ని నిరూపించుకున్నారు. ప్రజలు మరియు విద్యార్థులు ఇంతటి ఆసక్తి చూపుతున్న ఈ తరుణంలో, ప్రభుత్వం మరియు విద్యాశాఖ అధికారులు మరింత సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సరిపడా ఉపాధ్యాయులను నియమించి, మౌలిక వసతులు కల్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు ఇదొక ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజలు రగిలించిన ఈ విద్యాభివృద్ధి జ్వాలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు .

# హరీష్ రావుజన్మదినం

- టేక్మాల్ చౌరస్తాలో గులాబీ సంబరాలు
- భారీ కేక్ కటింగ్.. మిఠాయిల పంపిణీ.. టపాసుల హోరు.. కార్యకర్తల సందడి

మెదక్ జిల్లా, టేక్మాల్, జూన్ 3 (సాక్ష్యం న్యూస్):-
తెలంగాణ ప్రజల అభిమాన నాయకుడు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు 54వ జన్మదిన వేడుకలను టేక్మాల్ మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి (చౌరస్తా) వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. టేక్మాల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప ఆధ్వర్యంలో





పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేస్తూ హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చౌరస్తా మొత్తం గులాబీ జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, హరీష్ రావు చిత్రపటాలతో కళకళలాడగా, కార్యకర్తల నినాదాలతో టేక్మాల్ మండల కేంద్రం మార్మోగిపోయింది. "జై తెలంగాణ", "జై హరీష్ అన్న" నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టేక్మాల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పోరాడే నాయకుడు హరీష్ రావు అని అన్నారు.



తెలంగాణ ఉద్యమం నుండి నేటి వరకు ప్రజల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. రైతాంగ సంక్షేమం, సాగునీటి రంగ అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల పురోగతికి హరీష్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ ప్రతి కుటుంబానికి అండగా నిలిచిన నాయకుడు హరీష్ రావు అని అన్నారు. తెలంగాణ ప్రజల ప్రేమాభిమానాలను సంపాదించుకున్న హరీష్ రావు మరిన్ని సంవత్సరాలు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన నాయకులు నాయికోటి భాస్కర్, చింత రవి, మాజీ ఎంపీటీసీ సిద్దన్న, సలావుద్దీన్, ఎలకుర్తి మాజీ ఎంపీటీసీ లకావత్ మోహన్, ఎలకుర్తి గ్రామ పార్టీ నాయకులు సిహెచ్ చంద్రయ్య, సిద్ధిరాములు గౌడ్, యాదగౌడ్, సారా కిష్టయ్య, సారా లక్ష్మణ్, గడ్డమీది లక్ష్మయ్య, ఎర్రోళ్ల నాగేష్, కూసంగి సురేష్, కాదులూరు అంజగౌడ్, ఎల్లుపేట నారాయణ, రమేష్ చౌవాన్, వసంత్ రావు,తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై హరీష్ రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## భూ తగాదాల్లో సెటిల్‌మెంట్లు చేసేవారికి "కౌన్సిలింగ్" ఇవ్వండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

హనుమకొండ 3 జూన్(సాక్ష్యం)
భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వ వహిస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కెయూసి పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ఏసిపి నర్సింహరావు, ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికాలికారు. పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు, స్టోర్, కేసు ప్రాపర్టీగదులు, స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులను పరిశీలిస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా వున్న రౌడీ షీటర్లు, అనుమానితులు ఎవరు, ప్రస్తుతం వాళ్ళు



ఎలావున్నారు.. ఏం చేస్తున్నారు మొదలైన వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చే రౌడీ షీటర్లతో పాటు బెదిరింపులకు పాల్పడే వారికి ప్రత్యేక "కౌన్సిలింగ్" ఇవ్వాలని, రౌడీ షీటర్లపట్ల సానుభూతి ధోరణి ప్రదర్శించవద్దని, యాక్టివ్‌గా వున్న రౌడీపై నజర్ పెట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా, ముఖ్యంగా స్థానికంగా వున్న సామాజిక రుగ్మతలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, విద్యా సంస్థల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్టేషన్ ఎస్.ఐలు అప్పగించిన సెక్టార్ పరిధిలో నేరాల నియంత్రించడంతో పాటు, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో ఎస్.ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్‌కుమార్, రాజమౌళి, తదితరులు పాల్గోన్నారు.



## ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

### పాల్గొన్న ప్రజా ప్రతినిధులు అధికారులు





వరంగల్, 03 జూన్ (సాక్ష్యం)
వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు కూడా చైర్మన్ ఏనుగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు.అలాగే వరంగల్ జిల్లా కలెక్టర్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కమిటి మెంబర్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రారెడ్డి (కమిటీ కన్వీనర్), ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, అడ్మిన్ కమిటీ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి పనులు, వైద్య సేవల నాణ్యత, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతుల మెరుగుదలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

# జిల్లా మహిళ సమాఖ్య పెట్రోల్ బంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య

**హనుమకొండ 3 జూన్ (సాక్ష్యం)**
హనుమకొండ జిల్లా మడికొండలోని మహిళా ప్రాంగణంలో డీఆర్డీఏ, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళా సంఘాల సాధికారతకు తోడ్పాటుగా 1 కోటి 50 లక్షల తో నిర్మించనున్న జిల్లా మహిళ సమాఖ్య పెట్రోల్ బంక్ నిర్మాణానికి స్థానిక శాసన సభ్యులు కె.ఆర్ నాగరాజు తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతే సమాజ అభివృద్ధికి బలమైన పునాదని,







మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలను లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా యజమానులుగా, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకునే స్థాయికి తీసుకెళ్తోందన్నారు. మహిళలకు అవకాశం కల్పిస్తే వారు ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధించగలరని, ఇంటిని చక్కదిద్దే మహిళకు అవకాశం ఇస్తే వ్యాపారం, పరిశ్రమ, వ్యవసాయం, సేవా రంగం ఇలా అన్ని రంగాల్లోనూ తన ప్రతిభను చాటగలరని పేర్కొన్నారు. అదే విధంగా నేడు మడికొండలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని, ఇకపై మడికొండలో మహిళలు నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ ఉంది అని గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ కార్యక్రమాలు, సోలార్ రంగం వంటి అనేక రంగాల్లో మహిళలు విజయవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని గుర్తు



చేశారు. ముఖ్యంగా మహిళలను నాయకత్వ స్థానాల్లో నిలబెట్టే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి ఆదాయ వనరులు పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించబడనున్న ఈ పెట్రోల్ బంక్ మహిళలకు స్థిరమైన ఆదాయాన్ని అందించడమే కాకుండా, మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలు కుటుంబానికి, సమాజానికి వెన్నెముకలాంటివారని, వారు ఆరోగ్యంగా, బలంగా ఉంటేనే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని అన్నారు. అందుకే మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇస్తూ, మహిళలు అన్ని రంగాల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, డిఇడిఓ శ్రీనివాస్, బిపిసిఎల్ యండి సుధీర్, ముఖ్య నాయకులు, ఐకేపీ రీజినల్ కోఆర్డినేటర్లు, సీసీలు మరియు స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# తండా ప్రజల దాహార్తిని తీర్చిన యువ సర్పంచ్

– చెరువు సమీపాన వేయించిన నూతన బోరు – సంతోషంతో తండా వాసులు నీరాజనం

**పర్వతగిరి, జూన్ 3(సాక్ష్యం):**
వేసవి కాలం తీవ్రతతో తండాలో తలెత్తిన నీటి ఎద్దడి పై దృష్టి పెట్టి, తాగునీటి కొరత తీవ్రంగా ఉందని పై అధికారులకు వివరించి ఊరు చివరన బోర్ పాయింట్ వేసిన యువ సర్పంచ్ ను అభినందనలతో వెళ్ళు వెత్తుతున్న వివరాలు ఇలా ఉన్నాయి. పర్వతగిరి మండలం మోత్య తండా గ్రామ సర్పంచ్ భూక్యా నరేష్ తనకు ఓట్లు వేసిన ప్రజల దాహార్తి తీర్చేందుకు కంకణం కట్టాడు. ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజల దాహార్తిని తీర్చారు. గ్రామంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని గుర్తించిన సర్పంచ్ నరేష్, వెంటనే స్పందించి గ్రామంలోని చెరువు సమీపాన నూతనంగా బోరు వేయించారు. బుధవారం గ్రామ ప్రజల సమక్షంలో చేపట్టిన ఈ బోరు పనుల్లో నీరు నిరంతరాయంగా పడటంతో తండావాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఏళ్లనాటి నీటి సమస్య తీరడంతో గ్రామస్తులు సర్పంచ్ నరేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యువ నాయకత్వంతో



అభివృద్ధి చిన్న వయసులోనే ప్రజా సేవలో అడుగుపెట్టి, సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన భూక్యా నరేష్, అంకితభావంతో పనిచేస్తూ గ్రామాభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తున్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటిని పరిష్కరించేందుకు ఆయన చూపిస్తున్న చొరవను పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువ నాయకులు మరియు తండావాసులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు

– కేక్ కట్ చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**వర్ధన్నపేట, జూన్3(సాక్ష్యం):**
వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో మాజీ మంత్రి, ట్రబుల్ షూటర్, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా





దయాకర్ రావు మాట్లాడుతూ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు నిరంతర ప్రజాసేవతో, అద్భుతమైన నాయకత్వ పటిమతో తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్నారని ఎర్రబెల్లి అన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి, తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని పార్టీ శ్రేణులు కోరుకుంటున్నట్లు ఎర్రబెల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల పరామర్శ

**కోదాడ జూన్ 03,( సాక్ష్యం)**
కోదాడ మండలంలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రామాలయం వైస్ చైర్మన్ అన్నెం నర్సింహారెడ్డి తండ్రి అన్నెం వెంకటరెడ్డి మోకాలు ఆపరేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి బుధవారం అన్నెం వెంకటరెడ్డిని పరామర్శించి, వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి తులశమ్మ కన్నారెడ్డి, ఉప సర్పంచ్ బెల్లంకొండ సీతయ్య, రాష్ట్ర కౌలు రైతుల ఉపాధ్యక్షుడు అన్నెం పాపిరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ కొప్పుల సుభాష్ రెడ్డి,రామాలయం చైర్మన్ కొప్పుల సుబ్బారెడ్డి,



ఎర్రవరం గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ లతీఫ్,, టి సుజాత రామయ్య, అన్నెం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

– సర్పంచ్ పాలకు సురేష్

**కోదాడ జూన్ 03 ( సాక్ష్యం)** దోరకుంట గ్రామం లో గల ఆర్.ఆర్ సెంటర్ నెమలిపురి అంగన్వాడి సెంటర్ నందు పిల్లలకు బుధవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలకి సురేష్ ,వార్డ్ మెంబర్ కోనపర్తి తిరుమల చారి అంగన్వాడి టీచర్ నాగమణి పిచ్చిరెడ్డి కస్పరాజు సురేష్, మధు పిల్లల యొక్క తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చిన్నారులకు బాసటగా నిలిచిన అమ్మ చారిటబుల్ ట్రస్టు

**పాలకుర్తి,జూన్03(సాక్ష్యం):**
పాలకుర్తి మండలం ఎల్లారాయిని తోర్రుర్ గ్రామానికి చెందిన గాధరి సోమనర్సయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించగా బుధవారం రోజు వారి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి అమ్మ చారిటబుల్ ట్రస్టు తరుపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ధైర్యం చెప్పి 25 కేజీలబియ్యం,కూరగాయలు, నిత్యావసరాలను ట్రస్టు చైర్మన్ యతిపతి శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ జీడి హరీష్ అందజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి ఒర్రె కుమారస్వామి,గోనె కిరణ్,మృతుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రైతు కూలీ సంఘం రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి



**భూపాలపల్లి జూన్ 3 (సాక్ష్యం) :**
భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ప్రెస్ క్లబ్ వద్ద రైతు–కూలీ సంఘం రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమంకు రైతు కూలీ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం ముఖ్య అతిధి గా హాజరై పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వెల్తురు సదానందం మాట్లాడుతూ కేంద్రం లోని మోడీ సర్కార్ రైతంగాన్ని చిన్నభిన్నాం చేసే కుట్రలకు పాల్పడుతుందన్నారు. స్వేచ్చా వాణిజ్యం పేర ఇంగ్లాడ్, అమెరికా దేశాలతోచేసుకున్న ఒప్పందల్లన్ని మనదేశరైతులకు, కౌలు రైతులకు, కూలీలకు మెడకు ఊరి తాళ్ళుగా మారబోతున్నాయి. తనభూమిలోనే తనే కూలీగా రైతును నిలిపేమోడీ సర్కార్ కుట్రలకు వ్యతిరేకంగా రైతంగా ఆందోళనలు నిర్వహించాల్సిన సమయం ఇదే అన్నారు. రైతంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, భవిష్యత్ పోరాటాలను రూపొందిచుకొనేందుకు రైతు–కూలీసంఘం హైదరాబాద్, కాచిగూడ తుల్జా భవన్ లో తేదీ 9,10తేదీల్లో సదస్సు నిర్వహించుతుంది. సదస్సు జయప్రదం కోసం జిల్లాలోని రైతు –కూలీలు అధికసంఖ్యలోతరలవలసిందిగా పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రైతుకూలీ సంఘం నాయకులునరేందర్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్‌యుగేందర్, అల్లాడి వెంకన్న, అజిమిరా పవన్ , ఏఐఎఫ్ టీయు నాయకులు చంద్రగిరి శంకర్(స్త్రీవిముక్తి )నాయకురాలు దేవక్క పాల్గొన్నారు.

# బాధిత కుటుంబలకు చేయూత

– ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసహాయం – చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

**రాయపర్తి, జూన్ 3(సాక్ష్యం):** రాయపర్తి మండలం ఊకల్ గ్రామంలోబాధితులు కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. ఊకల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పసుల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స తీసుకోని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారిని పరామర్శించారు. అనంతరం నిరుపేద కుటుంబనికి చెందిన ఎదునూరి రాములు ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఈ రోజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఒక్కో కుటుంబనికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ మాజీ అధ్యక్షులు మునవత్ నర్సింహా నాయక్, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, పిఏసి చైర్మన్



కుందూరు రామ్ చంద్రా రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, శివ కుమార్ స్థానిక నాయకులు బొడ్డు రంగయ్య, పాము మనోహర్, గౌని అఖిల్, పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల చేత పౌర సన్మానం పొందిన విద్యుత్ కార్మికుడు నాదెళ్ల బాలకృష్ణ




**కోదాడ, జూన్03, (సాక్ష్యం)**
రాష్ట్రములో రైతుల చేత పౌర సన్మానం పొందిన విద్యుత్ కార్మికుడు నాదెళ్ల బాలకృష్ణ అని సర్పంచి



బల్గూరి స్నేహ దుర్గయ్య అన్నారు. మండల పరిధిలోని గణపవరం గ్రామంలో మే 1 ప్రపంచ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోదాడ మండల సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ నాదెళ్ల బాలకృష్ణ కు శ్రమశక్తి అవార్డును ప్రధానం చేసిన సందర్భంగా గ్రామంలోని రైతులు, ప్రజలు, నాయకుల ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో బుధవారం పౌర సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ నాదెళ్ల బాలకృష్ణ మాట్లాడుతూ వినియోగదారులకు ఎప్పుడు విద్యుత్ సమస్య వచ్చిన నేను ముందుండి పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి శంకరశెట్టి



కోటేశ్వర రావు, మాజీ సర్పంచి కామిశెట్టి కృష్ణవేణి నరసింహారావు, కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు ఇర్ల సీతారామరెడ్డి, దేవాలయ చైర్మన్ ఇర్ల వరాల్ రెడ్డి, మాజీ చైర్మన్ ఇర్ల నారపరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు జాబిశెట్టి నాగప్రసాద్, మాజీ ఉపసర్పంచి పోశం కృష్ణయ్య, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ పోశం ఎర్రకొండలు, సంపేట శ్రీనివాసరావు, పోటు ప్రసాద్, ఇర్ల శ్రీనివాసరెడ్డి, కాసాని శ్రీను, గునుకుల కోటిరెడ్డి, ముడియాల బ్రహ్మారెడ్డి, రంజిత్, వెంకన్న పాల్గొన్నారు.

# ఆరుగాలం కష్టపడ్డ రైతుల వడ్లు కొనుగోలు చేయాలి

– మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**పాలకుర్తి,జూన్ 03 (సాక్ష్యం):**
పాలకుర్తి నియోజకవర్గ పరిసర గ్రామాల రైతులు అకాల వర్షంతో పండించిన వరిధాన్యం నేలపాలై ఇబ్బందులు పడుతున్నామని రైతులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి పాలకుర్తి మండలకేంద్రంలని చాకలి ఐలమ్మ మార్కెట్ యార్డ్ ను సందర్శించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తి మార్కెట్ యార్డ్ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతులకు విత్తనాలు, ఎరువులు ఇవ్వలేక పోతోందని, సకాలంలో రైతుబంధు ఇవ్వకపోగా కనీసం పండిన పంటను మద్దతు ధరకు కొనే పరిస్థితిలో కూడా లేదని, ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వమని, వారం రోజుల నుంచి పడిగాపులు కాస్తున్నామని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని,ఈ ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడాలని మండిపడ్డారు. సంచులు లేవని, లారీలు సరిగా రావటం లేదని రైతులు తమ బాధ తెలపగా జనగామ జిల్లా కలెక్టర్ కి ఫోన్ చేశారు. ఆరుగాలం కష్టపడ్డ రైతుల వడ్లు కూడా రోడ్ల మీదనే ఉన్నాయని,ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్ లో ప్రతి పంటకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు బోనస్ ఎగ్గొట్టి ఆ మాటను బోగస్ చేసిందని,గత యాసంగి బోనస్ వెంటనే విడుదల చేయాలని,ఈ ప్రభుత్వం కరెంటు ఇవ్వరు, రైతుబంధు వేయరు, బోనస్ ఇవ్వరు, పండిన పంటను మద్దతు ధరకు కొనరని,ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి కొనుగోలు వేగవంతం చేసి రైతులని ఆదుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు పసునూరి నవీన్,నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు,ప్రజా ప్రతినిధులు, రైతులు, పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**వర్ధన్నపేట, జూన్ 3(సాక్ష్యం):**
ఇటీవల గుండె పోటుతో అకాల మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ శ్రీరాం రమేష్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. జర్నలిస్ట్ శ్రీరాం రమేష్ చిత్రపటానికి ఎర్రబెల్లి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ జర్నలిజం వృత్తిలో నిబద్ధతతో పనిచేసిన శ్రీరాం రమేష్ మరణం బాధాకరమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయుల సేవలు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. వారి కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. శ్రీరాం రమేష్ అకాల మృతి చెందడం జర్నలిజం లోకానికి తీరని నష్టం అని అయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గోధుమల మధుసూదన్, మండల అధ్యక్షులు తూల్ల కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి,



మున్సిపల్ కౌన్సిలర్స్ గుజ్జ వీరన్న, తిరుపతి సురేష్, మాజీ కౌన్సిలర్స్ తోటకూరి రాజమణి, తుమ్మల రవీందర్, బానోత్ శ్రీను, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ సిలివేరు శ్రీధర్ యాదవ్, పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి డా. కొండేటి శ్రీనివాస్, నాయకులు కొండేటి సంపత్, బానోత్ నవీన్, కందుగుల నర్సయ్య, మేకల శ్రీను, తగరాల విష్ణు, పడిశాల సతీష్, భూక్యా రాము, తదితర నాయకులు పాల్గొన్నారు...

# కమ్మగాని వెంకన్న కుటుంబ సభ్యులను ఓదార్చిన మాజీ మంత్రి

**పాలకుర్తి,జూన్ 03(సాక్ష్యం):**
ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన లికమ్మగాని వెంకన్న కుటుంబాన్ని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్వయంగా పరామర్శించారు. మృతుని భార్య, ఇద్దరు చిన్నారులను ఓదార్చి, వారి కుటుంబం ఎదుర్కొంటున్న విషాదాన్ని పంచుకున్నారు. చిన్న వయసులోనే కుటుంబ పెద్దను కోల్పోయిన ఈ కుటుంబానికి ధైర్యం చెబుతూ, కష్ట సమయంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. కమ్మగాని వెంకన్న ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి జిల్లా మరియు మండల నాయకులు స్థానిక సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలు అమ్మితే ఫర్టిలైజర్ షాప్ లపై పిడి యాక్ట్ కేసు పెట్టాలి

**భూపాలపల్లి జూన్ 3 (సాక్ష్యం) న్యూస్**

సిపిఐ ఎంఎల్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ డిమాండ్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం కామ్రేడ్ బందు సుజాత అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ హాజరై మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రంలో ఉన్న గ్రామాల్లో ఉన్న పర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న యజమాన్యంపై పిడి యాక్ట్ కేసు నమోదు చేయాలని అధికారులను డిమాండ్ చేస్తా ఉన్నాం ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ రేటుకు అమ్మితే విత్తనాలు కొన్న ప్రతి రైతుకు కంప్యూటర్ బిల్లు ఇవ్వాలని గ్రామాల్లో ఉన్న షాపులలో తనిఖీలు నిర్వహించాలని



కోరుతున్నాం ఒకపక్క ఎరువుల ధరలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విపరీతంగా పెంచినవి ఒక బస్తాకు 2300 ధరపించినది రైతే రాజు అంటూ రైతుల యొక్క నడ్డి విరుస్తున్నారు పెట్టిన పెట్టుబడి రాక రైతులు ఇబ్బంది పడుతుంటే ఎరువుల ధరలు మాత్రం విపరీతంగా పెంచుతున్నారు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తా ఉన్నాం ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఆత్కూరి శ్రీకాంత్ బుర్ర స్వాతి క్రాంతి రవి పాల్గొన్నారు

# టీయూడబ్లుజె నూతన కార్యవర్గం నియామకం

**మాడుగులపల్లి, జూన్ 03 సాక్ష్యం;**




తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో, బుధవారం నకిరేకల్ లోని వినాయక బ్యాంక్వెట్ లో నిర్వహించిన జిల్లా మహాసభలో మాడుగులపల్లి మండలం నూతన కార్యవర్గనియామకం చేపట్టడం జరిగింది.(టీయూడబ్ల్యూజె) ఐజెయూ, మండల



అధ్యక్షులుగా, షేక్ రసూల్,ప్రధాన కార్యదర్శి గా, దర్శనం రాం బాబు, గౌరవ అధ్యక్షులు గా చిట్యాల సురేందర్, ఉపాధ్యక్షులుగా పి. శ్రీనివాస్, నాగరాజు , సహాయ కార్యదర్శి గా చెరుకుపల్లి రాజు కోశాధికారిగా చిట్యాల సైదులు, లను ఎన్నుకోవడం జరిగిందని, జిల్లా అధ్యక్షులు కృష్ణ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి తోటి పాత్రికేయ మిత్రులు శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు, మాట్లాడుతూ సంఘం బలోపేతానికి, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కొరకు, పత్రికా విలేకరుల సమస్యల పరిష్కారానికి పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గంట రవి, వల్లపుదాస్ రమేష్, తిరుమలేష్, బొంగరాల శ్రీను, భరత్, రామకృష్ణ, సతీష్, తదితర పత్రిక విలేఖర్లు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు

**చౌటుప్పల్ జూన్ 3 (సాక్ష్యం )**



చౌటుప్పల్ మున్సిపాలిటీ భీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను చౌటుప్పల్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి హరీష్ రావు కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, సుర్వి మల్లేష్ గౌడ్, తాడూరు పరమేష్, వల్లందాస్ సతీష్, బొంగు నగేష్ గౌడ్, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్,తొర్పునూరి మల్లేష్ గౌడ్, కానుగు శివ, బండ్ల శ్రీకాంత్, అమీర్, మున్నా, సంగిశెట్టి శివ, అతహర్ పాషా, ఈశ్వర్, విజయ్, గంగాదేవి రమేష్, గంగాదేవి శివ, చీమకండ్ల కృష్ణయ్య, నరేంద్ర సాగర్, రమణ గోవి రఘు, పిల్లలమర్రి సాయి, గుండెబోయిన వెంకటేశం, కోయిలగూడెం వెంకటేశం, ముసిర్, ఒమర్, కళ్లెట్ల నాగరాజు, రెడ్డగోని మల్లేశం, ఊదరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని పిలుపు

**దేవరకద్ర, జూన్ 3 (సాక్ష్యం బ్యూరో)**



దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ సభ్యత్వ నమోదు మరియు ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్ రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు పల్లె రవి, వెంకటేశ్వర్



రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి మెట్టు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీలో గ్రూపులు, వర్గాలు లేవని, అందరూ కే. చంద్రశేఖర్ రావు టీమ్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాలను ప్రతి కార్యకర్త కచ్చితంగా పాటించాలని, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకుగా పనిచేయాలని సూచించారు. పార్టీ ఇంచార్జిలతో సమన్వయం చేసుకుంటూ మండల స్థాయి టీంలు అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ పార్టీ అని పేర్కొన్న ఆయన, మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయడానికి ఐకమత్యంతో కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, దీనిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు జాబితా సవరణపై ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్న ఆయన, పదేళ్ల పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో ఉన్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు ఓటు చేశారని, కానీ రెండున్నర ఏళ్లలోనే అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల హామీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

**- జడ్చర్ల సభా ప్రాంగణం, ఉదండాపూర్ - కరివెన రిజర్వాయర్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**మహబూబ్‌నగర్, జూన్ 3 ( సాక్ష్యం బ్యూరో ) :**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 4, 5 తేదీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, జూన్ 5న మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్త, జిల్లా ఎస్పీ దరావత్ జానకి, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఓఎస్డీ కమలాసన్ రెడ్డి తదితరులతో కలిసి జడ్చర్లలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జడ్చర్ల ఏరియా ఆసుపత్రి సమీపంలోని ఖాళీ స్థలంలో ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సభా ప్రాంగణం పరిసరాల పరిశుభ్రత, వేదిక నిర్మాణం, టెంట్ల ఏర్పాటు, ప్రజల కోసం సీటింగ్ సదుపాయాలు, త్రాగునీటి వసతి, వాహనాల పార్కింగ్, ప్రత్యేక వీఐపీ గ్యాలరీలు, పోలీస్ బందోబస్తు, బ్యారికేడ్ల ఏర్పాట్లు తదితర అంశాలను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ జానకితో కలిసి ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన



ఏర్పాట్లను పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద హెలిప్యాడ్ల నిర్మాణం, వ్యూ పాయింట్ వద్ద బారికేడ్ల ఏర్పాటు, పోలీస్ భద్రత, వాహనాల పార్కింగ్, టెంట్లు, త్రాగునీటి సదుపాయం, వీఐపీ గ్రీన్ రూములు, మరుగుదొడ్లు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌తో పాటు మంత్రుల హెలికాప్టర్లు దిగేందుకు రెండు హెలిప్యాడ్లను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భద్రతా దృష్ట్యా వ్యూ పాయింట్ వద్ద డబుల్ బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కరివెన రిజర్వాయర్ వద్ద కూడా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్ల నిర్మాణం, రిజర్వాయర్ కట్టపై వ్యూ పాయింట్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, వీఐపీలు మరియు మీడియా ప్రతినిధుల కోసం భోజన వసతులు, సమీక్ష సమావేశ ఏర్పాట్లు తదితర అంశాలను అన్ని శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, అగ్నిమాపక,





అటవీ, వైద్య ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అగ్నిమాపక శాఖ రెండు ఫైర్ టెండర్లను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ శాఖ నిరంతరాయ విద్యుత్ కోసం జనరేటర్లు ఏర్పాటు చేయాలని, అటవీ శాఖ సమావేశ ప్రాంగణంలో కోతులు, తేనెటీగలు, పాములు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# సుఫారి హత్య కేసును ఛేదించిన పోలీసులు

**పాలకుర్తి,జూన్ 03 (సాక్ష్యం):**

పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించిన దర్యాప్తులో భూ వివాదం నేపథ్యంలో సుపారి ఇచ్చి హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుడు తీగల ధర్మారావు మరియు అతని అన్న తీగల కిషన్ రావు మధ్య గత 10 సంవత్సరాలుగా భూ వివాదాలు కొనసాగు తున్నాయి. ధర్మారావు స్టేషన్ ఘనపూర్ లో తన భార్యతో కలిసి ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తూ ప్రతిరోజూ బస్సులో రాకపోకలు సాగించేవాడు. భూ వివాదాల నేపథ్యంలో ధర్మారావును హత్య చేసి ఆస్తిని దక్కించుకోవాలనే ఉద్దేశంతో కిషన్ రావు,అతని కుమారుడు తీగల కిరణ్ కుమార్ కుట్ర పన్నారు. ఈ క్రమంలో కిరణ్ హైదరాబాద్ కు చెందిన తన స్నేహితుడు తూముల గీతేశ్వర్ సహాయంతో రూ. 15 లక్షలకు సుపారి ఒప్పందం కుదుర్చుకొని, గీతేశ్వర్ ద్వారా సోనూ ఏ అభిషేక్ ద్వారా హత్య చేయించేందుకు ఒప్పించారు. సోనూ తనకు తెలిసిన సంజయ్, శ్రీకాంత్, హర్షిత్ లను కలుపుకొని బాధితుడి కదలికలపై మే నెలలో మూడుసార్లు రెక్కీ నిర్వహించారు. అనంతరం అడ్వాన్స్ గా



25000/- రూపాయలు సోనూ తీసుకున్నాడు అలాగే శూరిటీ కింద తీగల కిరణ్ లాండ్ డాక్యుమెంట్స్ ,ఖాళీ చెక్ లు ,ఖాళీ బాండ్ పేపర్ లు గీతహేశ్వర్ కు ఇచ్చినాడు . సోనూ సంజయ్, శ్రీకాంత్, హర్షిత్ లు మే 27న అద్దె కారులో హైదరాబాద్ నుండి స్టేషన్ ఘనపూర్‌కు వెళ్లి బాధితుడిని హత్య చేయడానికి ప్రయత్నించి నప్పటికీ అవకాశం దొరకలేదు. దీంతో పాలకుర్తికి చేరుకుని బస్టాండ్ ప్రాంతంలో కాపుకాసి, నడుచుకుంటూ వెళ్తున్న ధర్మారావుపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, డీసీపీ రాజమహేంద్ర నాయక్ పర్యవేక్షణలో 8 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృతంగా దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడం జరిగింది. నిందితుల నుండి కేసుకు సంబంధించిన కీలక ఆధారాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితులు కుట్రపూరితంగా బాధితుడిని హత్య చేయించేందుకు సుపారి గ్యాంగ్‌ను నియమించి నేరానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. కాగా ఈ కేసులో నిందితుడు సోనూ ఏ అభిషేక్ ప్రస్తుతం పరారీలో ఉండగా, అతని అరెస్టు కోసం ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన డీసీపీ రాజమహేంద్ర నాయక్ , ఏసీపీ నర్సయ్య , సీఐ పాలకుర్తి జానకిరామ్ రెడ్డి, సీఐ వర్ధన్నపేట శ్రీనివాస్ , సీఐ రఘునాథపల్లి శ్రీనివాస్ , ఎస్సై పాలకుర్తి పవన్ కుమార్, ఎస్సై దేవరుప్పుల, ఎస్సై కొడకండ్ల, సల్మాన్, హెడ్ కానిస్టేబుల్ సోమిరెడ్డి , పీసీలు రమేష్, రాజ్‌కుమార్, రవి, సురేష్, యాకయ్య, ప్రశాంత్ తదితర పోలీసు సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

# పాలమూరులో రెండు రోజుల పాటు సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

**- ప్రాజెక్టుల పరిశీలన, ఉన్నతస్థాయి సమీక్షలు, ఉద్దండాపూర్‌లో భారీ బహిరంగ సభ**

**మహబూబ్‌నగర్, జూన్ 3 ( సాక్ష్యం బ్యూరో )** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురు వారం, శుక్ర వారం రెండు రోజుల పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. పాలమూరు ప్రాంతంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించి, అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, జూరాల, కోయిల్‌సాగర్, ఉద్దండాపూర్, కరివేన, వట్టెం వంటి ప్రధాన ప్రాజెక్టుల పురోగతిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

**జూన్ 4న మక్తల్ నుంచి సోమశిల వరకు పర్యటన:**

జూన్ 4 గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం నారాయణపేట జిల్లా మక్తల్ హెలిప్యాడ్‌కు చేరుకోనున్నారు. అనంతరం ఎంఎన్‌కేఎల్ఐఎస్, భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల పనుల పురోగతిని అధికారులు వివరిస్తారు. తర్వాత ఎత్తిపోతల పథకం పనులను ప్రత్యక్షంగా పరిశీలిస్తారు. సాయంత్రం కోయిల్‌సాగర్ ప్రాజెక్టు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదిత బ్యారేజీలు, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డ్యామ్ ప్రాంతాలను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించనున్నారు. అనంతరం జోగులాంబ గద్వాల జిల్లా ధారూర్ మండలం గూడెందొడ్డి వద్ద జేఎన్ఎల్ఐఎస్ స్టేజ్-1 పంప్‌హౌస్, రిజర్వాయర్‌ను సందర్శిస్తారు. సాయంత్రం సోమశిలకు చేరుకున్న సీఎం, మృగవాణి రిసార్ట్ రివర్‌ఫ్రంట్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. సీఎం సోమశిలలోనే బస చేయనున్నారు.

**జూన్ 5న పీఆర్ఎల్ఐఎస్ పనుల విస్తృత పరిశీలన :**

జూన్ 5 శుక్రవారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు పంప్‌హౌస్‌కు సీఎం చేరుకోనున్నారు. అక్కడ నుంచి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్యాకేజీ-3 హెడ్ రెగ్యులేటర్, నార్లాపూర్ రిజర్వాయర్, డెలివరీ సిస్టర్న్, ఎంజీకేఎల్ఐఎస్ లిఫ్ట్-1 పంప్‌హౌస్‌లను పరిశీలిస్తారు. తర్వాత ఏదుల రిజర్వాయర్, పంప్‌హౌస్ పనులను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించి, కుమ్మెర వద్ద పీఆర్ఎల్ఐఎస్ ప్యాకేజీ-8 స్టేజ్-3 పంప్‌హౌస్, వట్టెం రిజర్వాయర్ పనులను సందర్శించనున్నారు. మధ్యాహ్నం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్తూర్ వద్ద కరివేన రిజర్వాయర్ పనులను పరిశీలించిన అనంతరం మీడియా సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

**ఉద్దండాపూర్‌లో భారీ బహిరంగ సభ :**

సాయంత్రం జడ్చర్ల మండలం ఉద్దండాపూర్‌కు చేరుకునే సీఎం, అక్కడ పీఆర్ఎల్ఐఎస్‌కు చెందిన ఉద్దండాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించనున్నారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. సభ అనంతరం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరనున్నారు.

# తాసీల్దార్ కార్యాలయంలో ఫైర్ పై అవగాహన

**- ఫైర్ పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి - తాసీల్దార్ సరోజ పావని**

**మాడుగులపల్లి జూన్ 3 సాక్ష్యం;**

మాడుగులపల్లి మండల తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఫైర్ మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే ఎలా స్పందించాలి, ప్రాణ ఆస్తి నష్టాలను ఎలా నివారించాలనే అంశాలపై సిబ్బందికి,ప్రజలకు అవగాహన కల్పించారు. సందర్భంగా వారు కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవిస్తే సిబ్బందిని ఎలా సురక్షితంగా బయటకు తీసుకురావాలో, రికార్డ్స్ పత్రాలను ఎలా తీసుకురావాలో అగ్నిమాపక సిబ్బంది ప్రత్యక్షంగా చేసి చూపించారు. చిన్నపాటి మంటలు అంటుకున్నప్పుడు కార్యాలయాల్లో ఉండే ఫైర్ ఎక్స్‌టింగ్యుషర్లను,కార్బన్ ఆక్సైడ్, డిసిపి పౌడర్ (అగ్నిమాపక పరికరాలు) ఎలా ఉపయోగించాలో సిబ్బందికి



శిక్షణ ఇచ్చారు. ప్రమాద తీవ్రతకు గురైన వారికి అందించాల్సిన ప్రాథమిక చికిత్స మరియు అత్యవసర రెస్క్యూ పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు కంగారు పడకుండా, సమీపంలోని అత్యవసర ద్వారాల ద్వారా సురక్షిత ప్రాంతాలకు ఎలా చేరుకోవాలో వివరించారు. సందర్భంగా తాసిల్దార్ సరోజ పావని మాట్లాడుతూ ఫైర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సరోజ పావని,అగ్నిమాపక అధికారి యాదగిరి,డిటి కత్తుల సైదులు, ఆర్ఐలు సత్యనారాయణ, శ్యామ్, తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు





# భారత్, న్యూజిలాండ్ సిరీస్ షెడ్యూల్ ప్రకటన

- కివీస్ గడ్డపై ఆరేళ్ల తర్వాత టీమ్ఇండియా టెస్టు సిరీస్
- రోహిత్, విరాట్‌కు కీలకం కానున్న న్యూజిలాండ్ పర్యటన
- న్యూజిలాండ్‌తో 12 మ్యాచ్‌లు ఆడనున్న భారత్
- ఐదు వన్డేలు, ఐదు టీ20లతో పాటు రెండు టెస్టులు
- అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ జరగనున్న సిరీస్

టీమిండియా కోసం న్యూజిలాండ్ ఓ భారీ సిరీస్‌ను ప్లాన్ చేసింది. భారత్ – న్యూజిలాండ్ దేశాల మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కివీస్ ఈ టూర్ ప్లాన్ చేసింది. న్యూజిలాండ్ గడ్డపై 40 రోజుల పాటు క్రికెట్ అభిమానులకు ఓ పెద్ద పండగే అని చెప్పొచ్చు. ఐదు వన్డేలు, ఐదు టీ20లతో పాటు రెండు టెస్టులతో కలిపి మొత్తం 12 మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత్ – న్యూజిలాండ్ మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టీమిండియా కోసం కివీస్ ఓ మెగా టూర్ ప్లాన్ చేసింది. ఏకంగా 40 రోజుల పాటు క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించేలా టెస్టు, టీ 20, వన్డేలతో ఓ మెగా సిరీస్‌నే సిద్ధం చేసింది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు న్యూజిలాండ్‌లో భారత జట్టు పర్యటించనుంది. ఈ టూర్‌లో ఐదు టీ20లు, రెండు టెస్టులతో పాటు ఐదు వన్డేల సిరీస్ కూడా ఉండటం విశేషం.న్యూజిలాండ్ ఇప్పటి వరకు ఆతిథ్యం ఇచ్చిన అతిపెద్ద ద్వైపాక్షిక సిరీస్‌లో టీమిండియా పర్యటన ఒకటిగా నిలవనుంది. అలాగే ఒకే పర్యటనలో ఓ విదేశీ జట్టుతో న్యూజిలాండ్ ఆడనున్న అత్యధిక మ్యాచ్‌ల సిరీస్ కూడా ఇదే కావడం విశేషం. భారత్ – న్యూజిలాండ్ మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సిరీస్ నిర్వహించనున్నారు.భారత్ – న్యూజిలాండ్ మధ్య ఈ సిరీస్ అక్టోబర్ 22 నుంచి ప్రారంభం కానుంది. క్రైస్ట్ చర్చ్ వేదికగా అక్టోబర్ 22న తొలి టీ20 మ్యాచ్‌తో ఈ సిరీస్ ప్రారంభమవుతుంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ అనంతరం నవంబర్ 4 నుంచి ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా వన్డే సిరీస్ స్టార్ట్ అవుతుంది. ఆ తర్వాత నవంబర్ 19 నుంచి రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనున్నారు. నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్‌లో తొలి టెస్టు, నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్‌లో రెండో టెస్టు నిర్వహిస్తారు. భారత్ చివరిసారిగా 2019 – 20 సీజన్‌లో టెస్టు సిరీస్ కోసం న్యూజిలాండ్‌కు వెళ్లింది. ఆ తర్వాత మళ్లీ న్యూజిలాండ్ రెండుసార్లు భారత్‌లో పర్యటించింది. ముఖ్యంగా 2024–25లో 3– 0తో క్లీన్ స్వీప్ చేసింది. రోహిత్, కోహ్లి టెస్టు రిటైర్మెంట్‌కు బీజం పడింది కూడా ఈ సిరీస్ నుంచే! అయితే కివీస్ గడ్డపై ఆరేళ్ల తర్వాత టీమ్ఇండియా టెస్టు సిరీస్ ఆడనుంది. 2019లో న్యూజిలాండ్‌లో భారత్ చివరిసారిగా టెస్టు మ్యాచ్ ఆడింది. ఇక 2022 తర్వాత ఆ దేశంలో భారత్ ఆడుతున్న తొలి వైట్ బాల్ సిరీస్ కూడా ఇదే కావడం విశేషం. 2022 నవంబర్‌లో కివీస్‌లో టీమ్ఇండియా వన్డే సిరీస్ ఆడింది. ఆ తర్వాత మళ్లీ ఈ పర్యటనతోనే కివీస్ గడ్డపై టీమ్ఇండియా ఆడనుంది. మరోవైపు స్టార్లు రోహిత్, విరాట్‌కు తమ కెరీర్‌లో ఇదే ఆఖరి న్యూజిలాండ్ పర్యటన అయ్యే అవకాశం ఉంది. టీ20, టెస్టులకు గుడ్ బై చెప్పేసిన ఈ స్టార్లు వన్డే ఫార్మాట్‌లోనే ఆడుతున్నారు. వచ్చే ఏడాది వన్డే వరల్డ్‌కప్‌లో ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ ఇద్దరికి తమతమ కెరీర్‌లో మరోసారి న్యూజిలాండ్‌లో ఆడే అవకాశం రాకపోవచ్చు!మరో మూడు రోజుల్లో టీమ్ఇండియా ఇంటర్నేషనల్ క్రికెట్‌లో మళ్లీ సందడి చేయనుంది. భారత్ పర్యటనకు అఫ్ఘానిస్థాన్ రానుంది. ఈ టూర్‌లో ఏకైక టెస్టు మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది. జూన్ 06న టెస్టు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌కు ముల్లాన్‌పుర్ వేదిక కానుంది. ఆ తర్వాత జూన్ 13న ధర్మశాల వేదికగా తొలి వన్డే జరగనుంది. జూన్ 17న రెండో, 20న మూడో వన్డేలో అఫ్గాన్– భారత్ ఢీ కొట్టనున్నాయి.

**న్యూజిలాండ్‌లో భారత పర్యటన పూర్తి షెడ్యూల్**

**టీ20 సిరీస్**

మొదటి టీ20 – అక్టోబర్ 22, క్రైస్ట్ చర్చ్. రెండో టీ20 – అక్టోబర్ 24, క్రైస్ట్‌చర్చ్. మూడో టీ20 – అక్టోబర్ 27, వెల్లింగ్టన్. నాలుగో టీ20 – అక్టోబర్ 30, ఆక్లాండ్. ఐదో టీ20 – నవంబర్ 1, హామిల్టన్.

**వన్డే సిరీస్:**

మొదటి వన్డే – నవంబర్ 4, ఆక్లాండ్. రెండో వన్డే – నవంబర్ 7, వెల్లింగ్టన్. మూడో వన్డే – నవంబర్ 10, హామిల్టన్. నాలుగో వన్డే – నవంబర్ 13, మౌంట్ మాంగనుయ్, ఐదో వన్డే – నవంబర్ 15, మౌంట్ మాంగనుయ్.

**టెస్టు సిరీస్:**

మొదటి టెస్టు – నవంబర్ 19–23, వెల్లింగ్టన్. రెండో టెస్టు – నవంబర్ 27 – డిసెంబర్ 1, క్రైస్ట్ చర్చ్.

## అహ్మదాబాద్ నుంచి సొంత ఇళ్లకు ఆటగాళ్లు

ఐపీఎల్ లో వరుసగా రెండోసారి ట్రోఫీ గెలిచి హిస్టరీ క్రియేట్ చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్యాన్స్ కు ఒక షాకింగ్ న్యూస్ చెప్పింది. అహ్మదాబాద్ లో టైటిల్ గెలిచిన తర్వాత టీమ్ మొత్తం సెలబ్రేషన్స్ కోసం బెంగళూరు సిటీకి రావడం లేదు. ప్లేయర్స్, సపోర్ట్ స్టాఫ్ అంతా అహ్మదాబాద్ నుంచి డైరెక్ట్ గా తమ సొంత ఇళ్లకు, హాలిడే ట్రిప్స్ కు వెళ్తున్నట్లు ఆర్సీబీ డైరెక్టర్ మో బోబాట్ వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్ లో వెల్లడించాడు. తను యూకే వెళ్తున్నానని, హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ హాలిడే ప్లాన్ చేసుకున్నాడని, కెప్టెన్ రజత్ పాటిదార్ కూడా ఇంటికి వెళ్తున్నాడని తెలిపాడు. అందువల్ల బెంగళూరు ఫ్యాన్స్ తో కలిసి సక్సెస్ ఎంజాయ్ చేయడానికి మరికొంత కాలం వెయిట్ చేయక తప్పదని అతడు స్పష్టం చేశాడు.



ఒకప్పుడు స్టార్ ప్లేయర్స్ ఉన్నా కప్ గెలవలేక 'అండర్అచీవర్స్' గా ముద్రపడిన ఆర్సీబీ, 2025 నుంచి కంప్లీట్ గా మారిపోయింది. ఐపీఎల్ హిస్టరీ లో వరుసగా రెండుసార్లు టైటిల్ గెలిచిన మూడో టీమ్ గా రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సడన్ చేంజ్ వెనుక ఎలాంటి క్రేజీ సైనింగ్స్ లేవు, కేవలం డేటా, ఎవిడెన్స్ ఆధారంగా తీసుకున్న డెసిషన్స్ మాత్రమే ఉన్నాయి. లీడ్ అనలిస్ట్ ఫ్రెడ్డీ వైల్డ్ అందించిన డేటా అనలిటిక్స్ ఈ సక్సెస్ లో కీ రోల్ ప్లే చేశాయి. కేవలం నంబర్స్ మాత్రమే కాకుండా నిపుణుల అంచనాలు, దినేష్ కార్తీక్ లాంటి సీనియర్ల గట్ ఫీలింగ్, టాక్టికల్ మైండ్ ను బ్యాలెన్స్ చేస్తూ టీమ్ ను నడిపినట్లు మో బోబాట్ వివరించాడు.ఈ సీజన్ లో ఆర్సీబీ సక్సెస్ కు కెప్టెన్ రజత్ పాటిదార్ బ్యాటింగ్ లో తెచ్చిన బిగ్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఒక మెయిన్ రీజన్.

## వైభవ్ సూర్యవంశీ రెమ్యునరేషన్ డబుల్

ఇండియా క్రికెట్ లో సరికొత్త సెన్సేషన్ గా మారిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ క్రేజ్ ఇప్పుడు అమాంతం పెరిగిపోయింది. ఐపీఎల్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడి 237.30 ఊహించని స్ట్రైక్ రేట్ తో 776 రన్స్ బాదిన ఈ బిహార్ బ్యాటర్ మార్కెట్ ను షేక్ చేస్తున్నాడు. టోర్నమెంట్ లో ఆరెంజ్ క్యాప్ తో పాటు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డును కూడా సొంతం చేసుకున్నాడు. ఈ సంచలన పర్ఫార్మెన్స్ తర్వాత మైదానం వెలుపల కూడా అతడి డిమాండ్ డబుల్ అయింది. ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ తో రూ. 1.10 కోట్ల యాన్యువల్ కాంట్రాక్ట్ లో ఉన్న వైభవ్, బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల రూపంలో అంతకు మించి సంపాదిస్తున్నాడు. ఆటోమొబైల్, మీడియా వర్గాల సమాచారం ప్రకారం ఐపీఎల్ స్టార్ట్ అవ్వడానికి ముందు వైభవ్ ఒక్కో బ్రాండ్ డీల్ కోసం దాదాపు రూ. 1 కోటి వరకు ఛార్జ్ చేసేవాడు. అయితే సీజన్ ముగిసేసరికి అతడి ఎండార్స్‌మెంట్ ఫీజ్ ఏకంగా డబుల్ అయింది. ప్రస్తుతం అతడు ఒక్కో కొత్త డీల్ కోసం రూ. 1.5 కోట్ల



నుంచి రూ. 2 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ ఎక్స్ పర్ట్ ఒకరు ఎన్డీటీవీ కి స్పష్టం చేశాడు. ఇప్పటికే కాంప్లాన్, రెడ్ బుల్ లాంటి పెద్ద బ్రాండ్లకు అంబాసిడర్ గా మారిన వైభవ్ తో కొలాబరేట్ అవ్వడానికి మరికొన్ని కంపెనీలు లైన్ లో ఉన్నాయి. చిన్న ఏజ్ లోనే వస్తున్న ఈ సడన్ పాపులారిటీ, బిజినెస్ డీల్స్ ను వైభవ్ సూర్యవంశీ పేరెంట్స్ జాగ్రత్తగా హ్యాండిల్ చేస్తున్నారు. అతడి ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ కూడా ఈ విషయంలో ఈ వండర్ కిడ్ మేనేజ్‌మెంట్ టీమ్ కు పూర్తి సపోర్ట్ అందిస్తోంది. ఐపీఎల్ లో సృష్టించిన రికార్డుల కారణంగానే బ్రాండ్లు అతడి వెనుక పరుగులు పెడుతున్నాయని ఎక్స్ పర్ట్స్ చెబుతున్నారు. ఒకవేళ భవిష్యత్తులో వైభవ్ ఐపీఎల్ మెగా వేలంలోకి వస్తే ఏకంగా రూ. 30 కోట్ల వరకు బిడ్ దక్కించుకునే ఛాన్స్ ఉందని కొందరు అంచనా వేస్తున్నారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సాధించిన అచీవ్‌మెంట్స్ చూసి మాజీ క్రికెటర్లు, లెజెండ్స్ అతడిని సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, సునీల్ గవాస్కర్ లాంటి గ్రేట్ ప్లేయర్లతో పోలుస్తున్నారు. టాలెంట్ పరంగా అతడి హిట్టింగ్ కెపాసిటీ అద్భుతంగా ఉన్నప్పటికీ, కెరీర్ ఇప్పుడిప్పుడే స్టార్ట్ అవుతుండటంతో వచ్చే అవకాశాలను జాగ్రత్తగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఐపీఎల్ తెచ్చిన ఈ స్టార్ డమ్ తో ఇండియా క్రికెట్ లో అతడి బ్రాండ్ వాల్యూ సరికొత్త రికార్డులను క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.


## ఒక్క తప్పిదమే పంజాబ్ కింగ్స్ పతనాన్ని శాసించింది

### రెడిట్‌లో వెల్లడించిన సచిన్ టెండూల్కర్

ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ప్రయాణం విచిత్రంగా ముగిసింది. టోర్నీ ఫస్టాఫ్‌లో 7 మ్యాచ్‌లకు 6 గెలిచిన పంజాబ్ కింగ్స్.. మరో మ్యాచ్ రద్దవ్వడంతో 13 పాయింట్స్‌తో అగ్రస్థానంలో నిలిచింది. ఐపీఎల్ చరిత్రలోనే తొలి 7 మ్యాచ్‌ల్లో ఓటమెరుగని జట్టుగా సరికొత్త రికార్డ్‌ను లిఖించింది. కానీ తర్వాతి 7 మ్యాచ్‌ల్లో వరుసగా 6 మ్యాచ్‌లు ఓడి ప్లే ఆఫ్స్ చేరకుండానే ఇంటిదారి పట్టింది. పంజాబ్ కింగ్స్ వైఫల్యానికి గల కారణాన్ని క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ రెడిట్‌లో వెల్లడించాడు. ఫస్టాఫ్ టోర్నీలో పంజాబ్ ప్రక్రియను నమ్ముకుంటే.. సెకండాఫ్‌లో ఫలితాలపై ఎక్కువ ఫోకస్ పెట్టి



మూల్యం చెల్లించుకుందన్నాడు. 'పంజాబ్ కింగ్స్ ఈ టోర్నీకి మంచి ఊపును తీసుకొచ్చింది. వారి క్రికెట్ సానుకూలంగా.. ధైర్యంగా.. ఆట స్వరూపాన్నే మార్చేసేలా సాగింది. సుదీర్ఘమైన టోర్నీల్లో మూమెంటమ్ అనేది చాలా కీలక పాత్ర పోషిస్తుంది. వేగంగా సాగే టోర్నీలో అంతా ప్రక్రియపైనే ఆధారపడి ఉంటుంది తప్ప ఫలితాలకు ఎక్కువగా కట్టుబడిపోకూడదు. పంజాబ్ జట్టు ఫస్టాఫ్‌లో ప్రక్రియపై ఎక్కువ దృష్టి పెట్టగా.. సెకండాఫ్‌లో ఫలితాలపై ఎక్కువ ఫోకస్ పెట్టింది.'అని సచిన్ పేర్కొన్నాడు. గుజరాత్ టైటాన్స్ చాలా నిలకడగా రాణించిందని సచిన్ కొనియాడాడు. 'గుజరాత్ టైటాన్స్ విషయానికి వస్తే.. ఈ సీజన్ మొత్తం ఒకే తరహాలో ప్రదర్శన కనబర్చింది. ఐపీఎల్‌లో ఎప్పుడూ ఏం జరుగుతుందో చెప్పలేం. కానీ గుజరాత్ ఫలితాలు అటు ఇటుగా మారినా.. ఆ జట్టు తమ ఆటతీరును మాత్రం మార్చుకోలేదు. ఫలితాలతో సంబంధం లేకుండా చాలా నిలకడగా రాణించారు. సుదీర్ఘ టోర్నీలో అప్పుడప్పుడు మెరుపు ప్రదర్శనలు చేయడం లేదా ఏదో ఒక మ్యాచ్‌లో ఒంటరి పోరాటంతో గెలవడం కంటే.. ఇలాంటి అనిశ్చితిని నియంత్రించే సామర్థ్యమే చాలా విలువైనదిగా నిలుస్తుంది. ఈ సీజన్‌లోనూ పాయింట్స్ టేబుల్‌లో జట్లు మారాయి. ఫస్టాఫ్ సమయంలో ఉన్నపాయింట్స్ టేబుల్.. టోర్నీ ముగిసే సరికి వేరుగా కనిపించింది. టోర్నీ సాగుతున్న కొద్దీ జట్లు తమ ఆటను మెరుగుపర్చుకున్నాయి.'అని సచిన్ టెండూల్కర్ చెప్పుకొచ్చాడు.



## కమిన్స్ ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశం!?

సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది జరగబోయే ప్రతిష్టాత్మక ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027తో పాటు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, యాషెస్ సిరీస్ లాంటి బిజీ షెడ్యూల్ ఆస్ట్రేలియాకు ఉండటంతో, పనిభారం తగ్గించుకునేందుకు ఐపీఎల్‌కు బ్రేక్ ఇవ్వనున్నట్లు కమిన్స్ హింట్ ఇచ్చాడు. ఒకవేళ కమిన్స్ దూరమైతే, ఐపీఎల్ 2026లో తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించిన ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ పూర్తిస్థాయి సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులను ఆందోళన కలిగించే వార్త ఒకటి వెలుగులోకి వచ్చింది. జట్టు కెప్టెన్, స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్ .. ఐపీఎల్ 2027 సీజన్‌కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అతడి స్వయంగా హింట్ ఇచ్చాడు. భవిష్యత్‌తో అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్ బిజీగా ఉందని.. దీంతో పనిభారం దృష్ట్యా.. ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశం ఉందని చెప్పుకొచ్చాడు.కాగా ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు.. వచ్చే 18 నెలలు కీలకం కానుంది. ఈ గ్యాప్‌లో ఆస్ట్రేలియా జట్టు.. ప్రతిష్టాత్మకమైన యాషెస్ సిరీస్, భారత్‌లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, ఆ తర్వాత వన్డే ప్రపంచకప్ 2027 ఆడాల్సి ఉంది. ఒకవేళ పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలిస్తే.. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ కూడా ఆడాల్సి రావచ్చు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఉన్న ప్యాట్ కమిన్స్.. ఈ టోర్నీలు అన్నింట్లో ఆడాలని భావిస్తున్నాడు. దీంతో అవసరమైతే ఐపీఎల్ 2027కు దూరమయ్యేందుకు సిద్ధమయ్యాడు. "వచ్చే ఏడాది ఏదో ఒక దశలో నేను కచ్చితంగా ఒక టోర్నీకి దూరం కావాల్సి ఉంటుంది. అయితే అది దేశం తరపున ఆడే టెస్ట్ మ్యాచ్‌లు లేదా వన్డే ప్రపంచకప్ మాత్రం కాదు. సమయం వచ్చినప్పుడు నేను నా ఐపీఎల్ ఫ్రాంచైజీ (సన్‌రైజర్స్ హైదరాబాద్)తో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటాను. ప్రస్తుతానికైతే దీనిపై నేను ఇంతకంటే ఎక్కువ క్లారిటీ ఇవ్వలేను. ఎందుకంటే పరిస్థితులు మారవచ్చు లేదా గాయాలు కూడా కావచ్చు" అని పత్రికతో మాట్లాడుతూ కమిన్స్ వ్యాఖ్యానించాడు. కాగా ఐపీఎల్ 2026లో కొన్ని మ్యాచ్‌లకు ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. దీంతో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సారథిగా ఇషాన్ కిషన్ వ్యవహరించాడు. కమిన్స్ వచ్చాక అతడే సారథ్య పగ్గాలు చేపట్టాడు. ఈ సీజన్‌లో సన్ రైజర్స్ టాప్-4లో నిలిచింది. అయితే ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడి.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. వచ్చే సీజన్‌లో కమిన్స్ అందుబాటులో లేకపోతే.. ఇషాన్ కిషన్ పూర్తిస్థాయి సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

# వచ్చే ఏడాది మార్చి 15 నుంచే ఐపీఎల్?

వచ్చే ఏడాది నుంచి ఐపీఎల్ షెడ్యూల్ మారనుందా? మార్చి 15 నుంచే టోర్నీ మొదలుకానుందా? మ్యాచ్‌ల సంఖ్య కూడా భారీగా పెరగనుందా? మీడియాలో వస్తున్న ఈ వార్తలపై బీసీసీఐ బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా తాజాగా క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఐపీఎల్ విండో మార్పు గురించి పెద్దగా ఆలోచించడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బీసీసీఐ ఐపీఎల్ మ్యాచ్‌లకు, ప్రేక్షకులకు ఇబ్బంది కలిగిస్తున్న వాతావరణ సవాళ్లను ఎదుర్కోవడంపై మాత్రమే దృష్టి పెట్టిందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండలు, వర్షాల వల్ల మ్యాచ్‌లకు అంతరాయం కలగకుండా వచ్చే సీజన్ నుంచి టోర్నమెంట్‌ను రెండు వారాల ముందే ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఏడాది (2026) ఐపీఎల్ మార్చి 28న ప్రారంభం కాగా, కొన్ని మ్యాచ్‌లపై వర్షం ప్రభావం పడింది. ముఖ్యంగా కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ పంజాబ్ కింగ్స్ మధ్య జరగాల్సిన ఒక మ్యాచ్ ఫలితం తేలకుండానే వర్షార్పణం అయ్యింది. మరోవైపు వేసవి ఎండల తీవ్రత వల్ల మైదానంలోని ఆటగాళ్లు, స్టేడియంలోని ప్రేక్షకులు చాలా ఇబ్బందులు పడ్డారు. టోర్నమెంట్ జరిగే సమయంలో ఇలా వేసవి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోవడంపై బీసీసీఐ ఆందోళన చెందుతోంది. ఓ ప్రముఖ మీడియాతో బీసీసీఐ బోర్డు మెంబర్ దేవజిత్ సైకియా మాట్లాడుతూ, ఐపీఎల్ మ్యాచ్‌ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచుతారనే [illegible] కొట్టిపారేశారు. "బీసీసీఐ ఈ అంశాన్ని అంత సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఎందుకంటే, గతంలో లాగానే ఈ ఏడాది కూడా ఐపీఎల్ రెండు నెలల కంటే ఎక్కువ కాలం సాగింది. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే, ఈ ఏడాది 2 నెలల 2 రోజులపాటు టోర్నమెంట్ జరిగింది. అయితే ప్రస్తుతం బీసీసీఐ బోర్డు మ్యాచ్‌ల సంఖ్య కంటే, వాతావరణ పరిస్థితులపైనే ప్రధానంగా దృష్టి సారించింది" అని దేవజిత్ సైకియా పేర్కొన్నారు. 'గతేడాది ఐపీఎల్ ప్రారంభమైన తర్వాత, మధ్యలో ఒక వారం పాటు టోర్నమింట్‌ను నిలిపివేశారు. దీనితో లీగ్ కొద్దిగా పొడిగించబడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మాకు ఉన్న ఆందోళన ఏమిటంటే, టోర్నమెంట్ మే 31 వరకు సాగితే, వర్షాల వల్ల కొన్ని మ్యాచ్‌లపై ప్రభావం పడే అవకాశం ఉంది. మరికొన్ని మ్యాచ్‌లపై ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా ఉండే ఛాన్సుంది' అని దేవజిత్ సైకియా అభిప్రాయపడ్డారు. తీవ్రమైన ఎండలు, ముందస్తు వర్షాల (ప్రీ–మాన్ సూన్) ప్రభావం పడకుండా ఉండడం కోసం ఐపీఎల్ షెడ్యూల్‌ను కాస్త ముందుకు జరిపి, మే నెల మధ్య నాటికే టోర్నమెంట్‌ను ముగించే అవకాశాలను బీసీసీఐ పరిశీలిస్తోందని సైకియా స్పష్టం చేశారు. "మేము ఐపీఎల్‌ను మరో 15 రోజులు ముందుకు తీసుకువచ్చే మార్గాలను అన్వేషిస్తున్నాం. ఈ ఏడాది మేము మార్చి 28న టోర్నీని ప్రారంభించాం. కానీ వచ్చే సీజన్ నుంచి కాస్త ముందుగా, అంటే బహుశా మార్చి 15 నాటికే ఐపీఎల్‌ను ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నాం. మేము ఇప్పటికే దీనిపై కసరత్తు ప్రారంభించాం. మే 15 కల్లా టోర్నమెంట్‌ను ముగించాలని చూస్తున్నాం. దీని వల్ల వేడి వాతావరణం లేదా వర్షాల ప్రభావం అటు ఆటగాళ్లపై, ఇటు స్టేడియానికి వచ్చే వీక్షకులపై, అభిమానులపై పడకుండా ఉంటుంది" అని సైజికా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఐపీఎల్ మ్యాచ్‌ల సంఖ్య పెంచుతారా, లేదా? అనే ప్రశ్నకు సైకియా తనదైన రీతిలో సమాధానం చెప్పారు. ఐపీఎల్ మ్యాచ్‌ల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోవాలన్నా, అది పూర్తిగా అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్, ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ (ఎఫ్‌టీపీ) నిబంధనలపై ఆధారపడి ఉంటుందని సైకియా స్పష్టం చేశారు. కాబట్టి మేము దీనిపై పని చేస్తున్నాం. కానీ మ్యాచ్‌లను 74 నుంచి 94కి పెంచే విషయాన్ని ప్రస్తుతానికి అంత సీరియస్‌గా తీసుకుంటున్నామని చెప్పలేను. ఎందుకంటే ఇందులో అనేక ఇతర అంశాలు ముడిపడి ఉన్నాయి. ఐసీసీ నిర్వహించే వివిధ ఎఫ్‌టీపీలు, ద్వైపాక్షిక సిరీస్‌లు, మల్టీనేషనల్ టోర్నమెంట్‌లను కూడా మేము పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల మ్యాచ్‌లు పెంచడంపై ప్రస్తుతానికి ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవడం లేదు. అయితే 2027 తర్వాత



# మాస్ మహారాజా రవితేజ, శివ నిర్వాణ, మైత్రి మూవీ మేకర్స్ 'ఇరుముడి' నుంచి 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' చిత్రంతో ప్రేక్షకులని ఆశ్చర్యపరచడానికి సిద్ధంగా ఉన్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'ఇరుముడి' చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కమర్షియల్ యాక్షన్‌కు భావోద్వేగాలను జోడిస్తూ రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేశారు. 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్‌లో ఒక కామన్ మ్యాన్ ప్రపంచాన్ని ఆకట్టుకునేలా చూపించారు. తన కూతురే అతని ప్రపంచం. ఆమె ఆనందం కోసం తీసుకునే నిర్ణయాలే అతని జీవితాన్ని నడిపిస్తాయి. తండ్రీ-కూతుళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని ఎంతో సహజంగా, హృదయానికి హత్తుకునేలా ఈ గ్లింప్స్‌లో ఆవిష్కరించారు. ఈ గ్లింప్స్‌లో మరో ప్రత్యేక ఆకర్షణ రవితేజ పాత్రలో కనిపించే ట్రాన్స్ఫర్మేషన్. అయ్యప్ప దీక్ష స్వీకరించిన తర్వాత ఆయన పాత్రలో చోటుచేసుకునే మార్పు ఎంతో హృద్యంగా చూపించారు. అది కేవలం ఒక త్యాగంలా కాకుండా, తన కూతురిపై ప్రేమతో, భక్తితో తీసుకున్న నిర్ణయంగా కనిపిస్తుంది. చివర్లో కనిపించే ఇరుముడి విజువల్స్ భావోద్వేగాన్ని మరింత పెంచి ప్రేక్షకుల మనసులను తాకాయి. శివ నిర్వాణ మరోసారి తన బలమైన ఎమోషనల్ స్టోరీటెల్లింగ్‌తో ఆకట్టుకున్నారు. సహజమైన భావోద్వేగాలతో తండ్రీ-కూతుళ్ల బంధాన్ని కథకు ప్రధాన బలంగా మలిచారు. ఆ అనుబంధం ఎంతో సహజంగా అనిపించడం వల్ల ప్రేక్షకులు పాత్రలతో వెంటనే కనెక్ట్ అవుతున్నారు. రవితేజ తన మాస్ ఇమేజ్‌కు భిన్నంగా ఈ చిత్రంలో కనిపిస్తున్నారు. మాస్ స్వాగ్‌ను పక్కనపెట్టి, భావోద్వేగాలతో కూడిన పాత్రలో ఎంతో అద్భుతంగా నటించారు. ఆయన బాడీ లాంగ్వేజ్, హావభావాలు పాత్రకు ప్రామాణిక తను తీసుకొచ్చాయి. గ్లింప్స్‌లో కనిపించిన యాక్షన్ ఎలిమెంట్స్ మాస్ ప్రేక్షకులకు కూడా మంచి ట్రీట్ ఇవ్వనున్నాయని సూచిస్తున్నాయి. బేబీ నక్షత్ర రవితేజ కూతురి పాత్రలో ఆకట్టుకుంది. ఆమె, రవితేజ మధ్య వచ్చే సన్నివేశాలు గ్లింప్స్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సినిమాటోగ్రాఫర్ విష్ణు శర్మ విజువల్స్ కథలోని భావోద్వేగాలను అందంగా తెరపై ఆవిష్కరించారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు ప్రాణంలా నిలిచి భావోద్వేగాలను మరింతగా ఎలివేట్ చేసింది. సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటింగ్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు ప్రతి ఫ్రేమ్‌లో అద్భుతంగా కనిపిస్తున్నాయి. 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్ ఒక తండ్రి ప్రపంచంలోకి తీసుకెళ్లే ఆహ్వానంలా ఆకట్టుకుంది. ఈ చిత్రం రవితేజ కెరీర్‌లో కొత్త కోణాన్ని చూపించబోతుందని హింట్ ఇచ్చింది. ఈ గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



# సింగ్ గీతం'లో చాలా యూనిక్ క్యారెక్టర్ చేశాను

## ఇలాంటి సినిమా ఇప్పటివరకూ ఇండియాలో రాలేదు
## ఇది యూనివర్సల్‌గా అందరికీ కనెక్ట్ అవుతుంది: హీరోయిన్ అహల్యా బమ్రూ

లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం' తో ముందుకు వస్తున్నారు. ప్రతిష్టాత్మక బ్యానర్లు వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. ఇప్పటికే విడుదలైన 'సింగ్ గీతం' టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. 'సింగ్ గీతం' జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అహల్యా బమ్రూ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

-మాది పుదుచ్చేరి. ఇంగ్లీష్, ఫ్రెంచ్, బెంగాలీ వంటి భాషలు మాట్లాడే ఒక ఇంటర్నేషనల్ కమ్యూనిటీలో పెరిగాను. నేను ఎప్పుడూ యాక్టర్ అవ్వాలని అనుకోలేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో కంటెంట్ క్రియేట్ చేస్తుంటాను. నాగ్ అశ్విన్ గారు నా కంటెంట్ చూసి ఈ సినిమా గురించి చెప్పారు. నా ఆడిషన్ కూడా ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే ఇచ్చాను (నవ్వుతూ)

-ఇది సంగీతం నేపథ్యంలో ఉండే సినిమా. నాకు పాటలు పాడటం, గిటార్ వాయించడం అంటే చాలా ఇష్టం. కాబట్టి ఇది నాకు తెలుగులో మంచి ఆరంభం అవుతుందని అనుకున్నాను. ఈ ప్రాజెక్ట్‌కు ఎంపిక చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

-సింగీతం గారి దర్శకత్వం, నాగ్ అశ్విన్ గారి నిర్మాణం, వైజయంతి మూవీస్ బ్యానర్ అనగానే మరో ఆలోచన లేకుండా ఈ సినిమాను ఒప్పుకున్నాను.

**సింగీతం శ్రీనివాసరావు గారితో పని చేయడం ఎలా అనిపించింది?**

-ఆయన అద్భుతమైన దర్శకుడు. ఆయన ఎన్నో గొప్ప సినిమాలు తీశారు. ఆయన సెన్స్ ఆఫ్ హ్యూమర్ కూడా చాలా బాగుంటుంది. ఆయన దర్శకత్వంలో పని చేయడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను. సింగీతం గారు తీసిన చిత్రాలన్నీ కూడా కాలానికి ముందున్నవే. సింగ్ గీతం కూడా అలాంటి సినిమానే. ఇండియన్ సినిమాలో ఇప్పటివరకు ఎవరూ ప్రయత్నించని కాన్సెప్ట్ ఇది. 94 ఏళ్ల వయసులో కూడా ఇంత మోడ్రన్ ఆలోచనతో సినిమా చేయడం ఆయనకే సాధ్యం.

**సినిమా మొదటి రోజు సెట్స్‌కి వచ్చినప్పుడు ఎలా అనిపించింది?**

-చాలా భయపడ్డాను. ఎందుకంటే నాకు తెలుగు రాదు. అయితే ఈ సినిమా యూనిట్ అంతా కుటుంబంలా కలిసిపోయింది. సినిమా ప్రారంభానికి ముందే నేను ఆన్‌లైన్‌లో తెలుగు నేర్చుకోవడం మొదలు పెట్టాను. ఆ శిక్షణ నాకు చాలా ఉపయోగపడింది. ఇప్పుడు కొద్దికొద్దిగా తెలుగు మాట్లాడగలుగుతున్నాను.

**ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

-సింగీతం గారు పాత్రలను ఎంత అద్భుతంగా రాస్తారో అందరికీ తెలుసు. ఆయన సినిమాల్లో మహిళా పాత్రలు చాలా బలంగా, స్వతంత్రంగా ఉంటాయి. ఇందులో నా పాత్ర కూడా చాలా కొత్తగా ఉంటుంది. ఇది సాధారణ క్లాసికల్ హీరోయిన్ పాత్ర కాదు. నా పాత్రకు తనకు ఏమి కావాలో స్పష్టమైన అవగాహన ఉంటుంది. చాలా బలమైన వ్యక్తిత్వం కలిగిన పాత్ర. ఇందులో విలన్ పాత్ర కూడా ఒక అమ్మాయే చేస్తోంది. ఇది చాలా అరుదైన విషయం. ఈ కథ యూనివర్సల్‌గా అందరికీ కనెక్ట్ అవుతుంది. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ ఎంజాయ్ చేసే సినిమా ఇది.

**దేవిశ్రీ ప్రసాద్ గారి సంగీతం గురించి?**

-ఇప్పటికే విడుదలైన "ఏమైంది ఏమైంది", "హలో బాసు" పాటలు ప్రేక్షకులను ఎంతో అలరించాయి. దేవిశ్రీ ప్రసాద్ గారు ఈ చిత్రానికి చాలా ప్రత్యేకమైన సంగీతాన్ని అందించారు. ఆయన జీనియస్ మ్యూజిక్ డైరెక్టర్. ఈ సినిమాకు చాలా బ్యూటిఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. పాటలు చాలా యూనిక్‌గా ఉంటాయి.

**సినిమా ఎలా ఉండబోతోంది?**

-ఇది చాలా కొత్త జానర్‌లో రూపొందిన సినిమా. ఇలాంటి సినిమాను మీరు ఇంతవరకు చూసి ఉండరు. జూన్ 11న థియేటర్లలో ఈ చిత్రాన్ని చూసి ఎంజాయ్ చేయాలి.

**నాగ్ అశ్విన్ గారి సపోర్ట్ గురించి?**

-నాగ్ అశ్విన్ గారి ఇన్‌వాల్వ్‌మెంట్ చాలా అద్భుతంగా ఉంటుంది. ఆయన సింగీతం గారికి అభిమాని. ఆయన అభిరుచి కూడా ఈ సినిమాలో కనిపిస్తుంది.
ప్రతి నటుడితో మాట్లాడి చాలా విలువైన సూచనలు ఇచ్చేవారు. దర్శకత్వం ๑ మొత్తం సింగీతం గారిదే. అయితే సినిమా మరింత బాగా రావడానికి అవసరమైన ప్రతిదాన్ని నాగ్ అశ్విన్ గారు చూసుకున్నారు. క్రియేటివ్ ప్రాసెస్‌లో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు.

**నిర్మాతల గురించి?**

వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ వంటి ప్రతిష్టాత్మక బ్యానర్లలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రియాంక గారు, స్వప్న గారు చాలా ఫ్రెండ్లీగా ఉంటారు. కొత్త తరహా కథలను ప్రేక్షకులకు అందించాలని ఎప్పుడూ ఆలోచిస్తుంటారు. వారితో కలిసి ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది.



**ఇంతకుముందు ఏ సినిమాలు చేశారు?**

బాలీవుడ్‌లో దర్శకుడు షూజిత్ సిర్కార్ గారి దర్శకత్వంలో అభిషేక్ బచ్చన్ గారితో ఒక సినిమా చేశాను. సింగ్ గీతం నాకు రెండో సినిమా. అలాగే తెలుగులో ఇది నా తొలి చిత్రం.

-నాకు సౌత్ ఇండియా అంటే చాలా ఇష్టం. తెలుగు ప్రేక్షకులు సినిమాలను ఎంతో ప్రేమిస్తారు. అలాంటి ప్రేక్షకులు ఉన్న పరిశ్రమలో పని చేయడం చాలా ఆనందంగా ఉంది.

**మీ డ్రీమ్ రోల్ ఏమిటి?**

-నాకు యాక్షన్ సినిమాలు చేయడం చాలా ఇష్టం. భవిష్యత్తులో అలాంటి పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను.

**మీకు తెలుగులో ఇష్టమైన హీరో ఎవరు?**

-మహేష్ బాబు గారు అంటే నాకు చాలా ఇష్టం. ఆయన బ్రిలియంట్ యాక్టర్.

**ప్రస్తుతం చేస్తున్న కొత్త సినిమాలు?**

-ప్రస్తుతం తమిళంలో ఒక సినిమా చేస్తున్నాను.

# జూన్ 19న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోన్న విజయ్ ఆంటోని 'వంద దేవుళ్ళు'

విజయ్ ఆంటోని చిత్రాలకు తెలుగులో ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఎప్పుడూ డిఫరెంట్ కంటెంట్, భిన్న ప్రాజెక్టులతో ప్రేక్షకుల్ని మెప్పిస్తూనే ఉంటారు. 'బిచ్చగాడు'తో హీరోగా విజయ్ ఆంటోని, దర్శకుడిగా శశికి వచ్చిన ఫాలోయింగ్ అందరికీ తెలిసిందే. మళ్లీ ఇన్నేళ్ల గ్యాప్ తరువాత విజయ్ ఆంటోని హీరోగా, శశి దర్శకత్వంలో 'వంద దేవుళ్ళు' అనే చిత్రం రాబోతోంది. ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి వచ్చిన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు ఆడియెన్స్‌లో బజ్‌ను పెంచేశాయి. ఇక తాజాగా ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి నిర్మించిన ఈ మూవీని జూన్ 19న విడుదల చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఈ సినిమాలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. రిలీజ్ డేట్ ప్రకటిస్తూ వదిలిన పోస్టర్ ఎంతో ఇంప్రెస్సివ్‌గా ఉంది. ఈ పోస్టర్‌లో హీరో, హీరోయిన్ కనిపిస్తున్న తీరు, సైకిల్ మీద సింపుల్‌గా వెళ్తున్న తీరు చూస్తుంటే ఇదొక పీరియాడిక్ డ్రామా అని అర్థం అవుతోంది. ఫ్యామిలీ, ఎమోషన్స్, యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లింగ్ ఇలా అన్ని రకాల ఎలిమెంట్స్‌తో 'వంద దేవుళ్ళు' సినిమాని రూపొందించారు. ఈ సినిమాకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేశారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు. ఇక ఈ మూవీని జూన్ 19న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.



# సిఎం విజయ్‌తో ఖుష్బూ సుందర్ కుటుంబం భేటీ

ప్రముఖ నటి, బీజేపీ నాయకురాలు ఖుష్బూ సుందర్, ఆమె భర్త, ప్రముఖ సినీ దర్శకుడు సుందర్ సి. తమ కుమార్తె అవంతిక వివాహ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి విజయ్ నివాసానికి వెళ్లిన ఖుష్బూ దంపతులు, తమ కుమార్తె అవంతిక, కాబోయే అల్లుడు శ్రవణ్ శ్రీనివాసన్ ల వివాహ పత్రికను ఆయనకు అందజేసి ఆశీస్సులు కోరారు.
ఈ ప్రత్యేక కలయికకు సంబంధించిన వివరాలను, ఫోటోలను ఖుష్బూ సుందర్ తన సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ రోజు తమ కుటుంబానికి ఎంతో



ప్రత్యేకమైనది అని పేర్కొన్న ఖుష్బూ.. ముఖ్యమంత్రి విజయ్‌ను తన ప్రియమైన సోదరుడిగా అభివర్ణించింది. విజయ్‌ను చూడటం ఎల్లప్పుడూ ఉంటుందని. తమ పిల్లలు కూడా విజయ్‌ను చూసి ఎంతో ఆనందించారని, ఆయన ఎంత బిజీ షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ ఎప్పటిలాగే ఎంతో ఆప్యాయతతో, చిరునవ్వుతో తమను స్వాగతించారని ఆమె రాసుకొచ్చింది. ఈ సందర్భంగా తమకు ఎంతో విలువైన సమయాన్ని కేటాయించి, ప్రేమను, ఆశీస్సులను అందించినం దుకు ముఖ్యమంత్రి విజయ్‌కు ఖుష్బూ తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గతంలో సినీ రంగంలో కలిసి ప్రయాణించిన వీరిద్దరి మధ్య ఉన్న ఆత్మీయ బంధం, విజయ్ ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ అలాగే కొనసాగడం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఖుష్బూ కుటుంబం విజయ్‌తో దిగిన ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.


# రామ్‌చరణ్ ఖాతాలో పెద్ది విజయం పడేనా

## బుచ్చిబాబు సెంటిమెంట్‌ను బద్దలు కొట్టేనా

సంక్రాంతి తర్వాత తెలుగు సినీ పరిశ్రమ ఓ మంచి విజయవంతమైన చిత్రం కోసం ఎదురుచూస్తోంది. మరి రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' ఆ లోటును భర్తీ చేస్తుందా అని ఇప్పుడు అంతా ఎదురు చూస్తున్నారు. 'పెద్ది' సక్సెస్ అందరికన్నా రామ్‌చరణ్‌కు చాలా ముఖ్యం. ఎందుకంటే 'రంగస్థలం' తర్వాత ఆ స్థాయి నటన, విజయం అందించిన చిత్రమేదీ ఆయన నుంచి రాలేదు. 'వినయ విధేయ రామ', 'ఆచార్య', 'గేమ్ ఛేంజర్' అన్నీ చేదు అనుభవాన్ని ఇచ్చినవే. మధ్యలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్' చరణ్‌ను గ్లోబల్‌స్టార్ చేసినా అది రాజమౌళి, ఎన్టీఆర్‌లతో కలిసి షేర్ చేసుకునే విజయమే అవుతుంది. ఈ క్రమంలో చరణ్ ఆశలన్నీ 'పెద్ది' పైనే. 'మస్స మస్స' సాంగ్ చూస్తేనే అర్థమవుతోంది ఈ మూవీ కోసం చరణ్ ఎంత కష్టపడ్డారో. 'ఇలాంటి కథ కోసం కాకపోతే ఇంకెప్పుడు కష్టపడతా'మని కూడా చెప్పారు. చెర్రీకి 'పెద్ది'పై ఉన్న నమ్మకం అలాంటిది. ఇప్పటికే సుకుమార్‌తో మూవీ ప్రకటించారు. ఎంతలేదన్నా ఈ మూవీ రావడానికి కనీసం ఏడాది నుంచి రెండేళ్ల సమయం పడుతుంది. దీంతో చరణ్ హిట్ కొట్టక తప్పని పరిస్థితి.తెలుగు సినీ ఇండస్ట్రీలో దర్శకులను ద్వితీయ విఘ్నం వెంటాడుతూనే ఉంటుంది. ఫస్ట్ మూవీ హిట్ కొట్టి, రెండో మూవీ ఫ్లాప్ అందుకున్న దర్శకులు చాలామందే ఉన్నారు. దాన్ని బద్దలు కొట్టి విజయాన్ని అందుకున్నవారు తక్కువ. 'ఉప్పెన'తో బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించడమే కాదు, అవార్డులను కొల్లగొట్టారు బుచ్చిబాబు. దాదాపు ఐదేళ్లుగా 'పెద్ది' కథతో ప్రయాణం చేసి, ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇండస్ట్రీ సెంటిమెంట్‌ను బద్దలు కొట్టడానికి ఈ విజయం బుచ్చిబాబుకు తప్పనిసరి.




శ్రీదేవి తనయగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినా, ఇప్పటివరకూ బ్లాక్‌బస్టర్ విజయం మాత్రం జాన్వీకపూర్‌ను వరించలేదు. తెలుగులో 'దేవర'తో ఎంట్రీ ఇచ్చినా, ఆ పాత్రకు పెద్ద గుర్తింపు రాలేదు. ఇప్పుడు పెద్దిలో 'అచ్చియ్యమ్మ'గా ఆమె కనిపించనున్నారు. జాన్వీ కారణంగానే ఈ మూవీకి కళ వచ్చిందని ఇప్పటికే బుచ్చిబాబు చెప్పారు. మరి జాన్వీ కెరీర్‌కు 'పెద్ది' టర్నింగ్ పాయింట్ కావాల్సిందే. ఏఆర్ రెహమాన్.. ఆస్కార్‌ను సైతం అందుకున్న గొప్ప సంగీత దర్శకుడు. తమిళ, హిందీ భాషల్లో ఆయన అందించిన సంగీతం, పాటలు తెలుగు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కానీ, తెలుగులో ఆయన నేరుగా చేసిన సినిమాలేవీ మ్యూజిక్‌పరంగా మెప్పించలేకపోయాయి. 'చికిరి' సాంగ్‌తో ఆ అనుమానాలను పటాపంచలు చేశారు. ఆ తర్వాత 'రయ్ రయ్ రారా', 'హల్లో హల్లల్లో' అలరించాయి. ఇక 'మస్స మస్స' ఆ అంచనాలను పెంచింది. వీటన్నింటికన్నా అసలు చూడాల్సింది నేపథ్య సంగీతం. స్పోర్ట్స్ డ్రామా, బలమైన భావోద్వేగాలు కలిగిన ఇందులోని సన్నివేశాలు ఎలివేట్ కావాలంటే అందుకు సంగీతం వారధి అవుతుంది. వీరే కాదు, గౌర్నాయుడు పాత్రపై శివరాజ్‌కుమార్, అప్పలసూరి పాత్రపై జగపతిబాబు, రామ్ బుచ్చి పాత్రపై దివ్యేందు చాలా ఆశలే పెట్టుకున్నారు.



Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380